

'లెక్క'లేనన్ని,,,అక్రమ కట్టడాలు,,!

77 భవంతుల్లో 8కే తుడా అనుమతి



నిబంధనలు మీరి నిర్మించిన అపార్ట్మెంట్ భవనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏదైనా ఘటన జరిగినపుడే అధికార యంత్రాంగం హడావిడి అంతా.. ఆ తరువాత షరా'మామూలే'.. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ పరిధిలో 2020 నుండి 2025 వరకు దాదాపుగా 77 భవంతుల నిర్మాణం జరిగినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. ఇందులో జి ప్లస్ 3, జి ప్లస్ 4, జి ప్లస్ 5 భవంతులు ఉన్నాయి. తుడా నుండి జి ప్లస్ 3 అనుమతులు పొందింది కేవలం 8 మాత్రమే. మిగిలిన వాటికి అసలు అనుమతులు ఉన్నాయో లేవో అనేది తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ వెల్లడించాల్సి ఉంది. వాస్తవంగా పంచాయతీ పరిధిలో తుడా అప్రూవల్ జరిగితే తుడా కార్యాలయం నుండి అప్రూవల్ జరిగిన ఫ్లాటుకు సంబంధించిన ఫైల్ పంచాయతీ కార్యదర్శికి పంపాల్సి ఉంటుంది. అలానే పంచాయతీ పరిధిలో పంచాయతీ అప్రూవల్ పొందిన ప్లాటుకు సంబంధించి తుడాకు కట్టిన నగదు రుసుములతో సంబంధించిన ఫైల్ పంచాయతీ నుండి తుడాకు పంచాయతీ సిబ్బంది చేరుస్తుంటారు. అయితే ఏడాదికాలంగా ఇటువంటి ప్రక్రియ జరిగినట్లుగా కనిపించడం లేదు. ఏదేని అనుమతి లేని నిర్మాణాలు జరుగుతూ ఉంటే ప్రభుత్వ విభాగాలు సమన్వయ పరుచుకుని అనుమతి లేని భవన నిర్మాణాలను అడ్డుకోవడం, అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించడం చేయాల్సి ఉంది. అయితే ఇలాంటి ప్రక్రియ ఎక్కడా జరిగినట్లుగా లేదనే చెప్పాలి.

నిన్నటి ఘటనలో అసలు యజమాని ఆందాలయ్య కాదా..?

మంగళవారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల దుర్ఘటనలో వాస్తవంగా స్థల యజమాని స్రవంతి అనే మహిళ. భూ రికార్డుల ప్రకారం కేసు నమోదు చేయాలని ఉన్నా, రాజకీయ ఒత్తిళ్లో మరే ఇతర కారణాలో తెలియదు గాని పోలీసులు, అధికారులు, మీడియాను సైతం తానే యజమానిగా నమ్మించిన అండాలయపై కేసు నమోదు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు భవన యజమానిపై కేసు నమోదు చేయాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించడం జరిగింది. అయితే భవన యజమాని స్రవంతి అని రికార్డు పూర్వకంగా ఉంది. ఈమెపై కాకుండా భవన యజమాని అని అందరినీ నమ్మించి మోసపూరితంగా వ్యవహరించిన కడివేటి ఆండాలయ్యపై కేసు నమోదు చేసి కార్మికుల దుర్మరణానికి కారణమైన వారిని విడిచి పెట్టేందుకు తెర వెనుక ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

ఏదైనా సంఘటన జరిగితేనే స్పందిస్తారా....?

ఎంతో కాలంగా అనుమతులు లేకుండానే ఎన్నో భవంతులు నిర్మాణం అవుతున్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నా అధికారుల జేబులు నిండటం వల్లనే అధికార యంత్రాంగంలో చలనం లేదన్న విమర్శలు లేకపోలేదు. రాజకీయ సిఫార్సులతో నిర్మాణ పనులు అలా అలా జరిగిపోతూనే ఉన్నాయి. మంగళవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ లో జరిగిన దుర్ఘటనలు జరిగితేనే స్పందిస్తారా అని ప్రజలు విమర్శిస్తున్న పరిస్థితి. ఈ సంఘటనతో అయినా జిల్లా యంత్రాంగం స్పందించి ఎక్కడెక్కడ అనుమతి లేని భవంతుల నిర్మాణం జరుగుతోందో గుర్తించి కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'స్కిల్ అప్ చిత్తూరు'పై రైతులకు అవగాహన



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి)

రైతులకు లాభసాటి వ్యవసాయానికి అవసరమైన డిజిటల్ టెక్నాలజీపై అవగాహన పెంపొందించుటకు వినూత్నంగా చిత్తూరు జిల్లాలో స్కిల్ అప్ చిత్తూరు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో వ్యవసాయశాఖ ద్వారా స్కిల్ అప్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్‌కు సంబంధించి రెండో విడత శిక్షణ కార్యక్రమంను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు లాభసాటి వ్యవసాయం దిశగా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు స్కిల్ అప్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని మొదటి విడత కార్యక్రమాన్ని మార్చి 7 నుంచి 14 వరకు 344 మంది రైతులకు, ఆర్ఎస్‌కె ఇన్చారులకు 8 మంది మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందనన్నారు. మే 2 వ తేదీ నుండి 21వ తేదీ వరకు రెండో విడత శిక్షణా కార్యక్రమాలకు 75 మంది మాస్టర్ ట్రైనలను గుర్తించడం జరిగిందని 502 రైతు సేవా కేంద్రాలలో ప్రతి రైతు సేవ కేంద్రంలో 30 మంది రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు తద్వారా రెండో విడతలో 15 0 60 మంది రైతులకు సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని లాభసాటి వ్యవసాయం దిశగా కృషి చేయాలన్నారు. మొదటి విడత డిజిటల్ ట్రైనింగ్ లో మాస్టర్ ట్రైనర్లు గా పనిచేసిన 8 మందికి జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్ ,జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం



మహిళలకు కిట్లు అందిస్తున్న కడా పీడీ వికాస్ మరమ్మాత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: మహిళల ఆర్థిక అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం తెలిపారు. బుధవారం కుప్పం మండల అభివృద్ధి కార్యాలయంలోని సమావేశ మందిరంలో కడా పీడీ వికాస్ మరమ్మాత్ ఆధ్వర్యంలో ఫ్రంట్ టైర్ మార్కెట్స్ వారు మహిళకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణకు ఎంపికైన మహిళలకు కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నారని అన్నారు. మహిళలు డిజిటల్‌పై అవగాహన పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కడా పీడీ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా పైకి తెచ్చేందుకే ఫ్రంటర్ మార్కెట్ సంస్థతో కడా ఒప్పందం చేసుకుందని, మహిళలు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందిందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, జనసేన నేత నరేష్, క్లస్టర్ ఇంచార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌గా ప్రసన్న కుమార్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి



మండల తహశీల్దార్‌గా ఎంఎస్. ప్రసన్న కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడున్న తహశీల్దార్ మాధవరాజు బదిలీ కావడంతో శాంతిపురం మండలం డిప్యూటి తహశీల్దార్‌గా పనిచేస్తున్న ప్రసన్న కుమార్ బైరెడ్డిపల్లి మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా డీటీ ఉద్యోగవిరమణ



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండల డిప్యూటీ తహశీల్దార్ కోమల గత ఏడు సంవత్సరాలుగా మండలంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు శాలువా కప్పి ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం డీటీగా మండలానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లోకనాథ్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి మాజీ మండల అధ్యక్షులు మోహన్ మురళి, జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మహేష్, దేవరగుడిపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, వర్మ పాల్గొన్నారు.

రంగనాథ రెడ్డికి నివాళి



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: వైసిపి సీనియర్ నాయకుడు ముక్కర రంగనాథరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నారాయణ స్వామి మాట్లాడారు. కొత్తపల్లిమిట్ట వాణిజ్య కూడలిలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని అందించి రంగనాథరెడ్డి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన భార్య నీలమ్మ, కుమారుడు సురేష్ రెడ్డి, మాధవి, రిషిక్ రెడ్డిను పరామర్శించారు. అనంతరం మాధవి, సురేష్ రెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మణి, మాజీ సర్పంచ్ విజయబాబు, గురువారెడ్డి, జనార్ధన్, జయవేలు రెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

అపోలో వద్దు.. ప్రభుత్వ ఆసుపత్రే ముద్దు..



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో హాస్పిటల్ వద్దు.. ప్రభుత్వ ఆసుపత్రి ముద్దు.. అంటూ ప్రజా దండయాత్రలో భాగంగా మూడోరోజు బుధవారం చిత్తూరు గిరింపేట సర్కిల్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం మాట్లాడుతూ బిడ్డను పోగొట్టుకున్న తండ్రిగా భవిష్యత్తులో తనకు పట్టిన దుర్గతి ఎవరికి రాకూడదని ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలను చైతన్యవంతులు చేసి అపోలో హాస్పిటల్‌తో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అపోలో డాక్టర్లు అపోల యాజమాన్యంపైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తానని ఆయన తెలిపారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి శోభారాణి మాట్లాడుతూ అపోలో యాజమాన్యం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని కైవసం చేసుకుని వారి మెడికల్ యూనివర్సిటీ పిల్లల విద్యా బోధన కోసం వ్యాపార సంస్థగా మార్చారని, పేదప్రజలకు వైద్యం అందడం లేదని తాము మొదట నుండి ప్రభుత్వ ఆసుపత్రి అపోలో యాజమాన్యానికి తెచ్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని పోరాటం చేస్తున్నామని అయినా ప్రభుత్వం దానిపైన చర్య తీసుకోలేదని విమర్శించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే తక్షణం ముఖ్యమంత్రి అపోలో ఆసుపత్రికి ఇచ్చిన ఒప్పందాన్ని రద్దు చేయాలని ఈ దిశగా ప్రజలను చైతన్యవంతులు చేసి ప్రజల మద్దతుతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పెన్షనర్ల ఉసురు పోసుకుంటున్న ప్రభుత్వం

సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉద్యోగులు, పెన్షనర్లకు కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపిందని రాష్ట్ర ఉద్యోగ పెన్షనర్ల సంఘ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. చిత్తూరు పర్యటనలో భాగంగా వైసిపి నియోజకవర్గ ఇంచార్జ్ విజయానందరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయనకు రాష్ట్ర ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం వైస్‌ప్రెసిడెంట్ విజయసింహారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగులకు అండగా ఉంటాం, స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తామని వాగ్దానాలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని అన్నారు. ఉద్యోగస్తులకు ఒకటవ తారీఖు జీతాలు ఇస్తామని ప్రగల్బాలు పలికి కేవలం ఒకనెల మాత్రమే అమలు పరిచిందని విమర్శించారు. చిన్న చిన్న ఉద్యోగులకు అయితే నెలల తరబడి వేతనాలు చెల్లించడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చామని గవర్నర్ వద్ద కూడా అపద్ధం ఆడించిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదే అని, ఎక్కడ ఇచ్చారని అడిగితే భవిష్యత్తులో ఇస్తామని బుకాయిస్తున్నారని అన్నారు. ఉద్యోగస్తుల మీద రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేయటమే కాకుండా వారికి పార్టీ ముద్రవేసి పోస్టింగ్‌లు ఇవ్వకుండా, జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. నిజాయితీ గల ఉద్యోగులు నిఖార్సుగా ఉద్యోగం చేస్తే కూడా వారిని కూడా వేధించడం తగదన్నారు. కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి, పెనువేలు సింహా, రెడ్డప్ప, రాజారెడ్డి, పెరుమాళ్ రెడ్డి, మొగిలయ్య, దండపాణి, రాజరత్నంరెడ్డి, జ్ఞానజగదీశ్ పాల్గొన్నారు.




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

గంగమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలో ప్రతి సంవత్సరం జరిగే గంగమ్మ జాతర కార్యక్రమాలు బుధవారం 30వ తేదీన ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఉదయం గంగమ్మ, మారెమ్మ ఆలయాలలో మంగళ వాయిద్యాల మధ్య అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీధర్, కార్యవర్గం మీడియాతో మాట్లాడుతూ మేనెల 14, 15, 16 తేదీల్లో జరిగే గంగ జాతరకు నాందిగా గంగమ్మ మారెమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రారంభించి, రాత్రి గంగ చాటింపు కార్యక్రమంతో మొదలుపెట్టడం జరిగిందన్నారు. గురువారం 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజు వివిధ సంఘాల తరపున ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జాతర కార్యక్రమానికి ప్రజలు, పుర ప్రముఖులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


నారాయణ స్వామిని సన్మానించిన స్కైలా రెడ్డి

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని స్కైలారెడ్డి దుశ్శాలవ కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49. కొత్తపల్లి మిట్ట గ్రామంలో బుధవారం నూతన గృహప్రవేశం కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కైలారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గురువారెడ్డి, మణి, విజయబాబు, కోటిరెడ్డి బాబు, నాగరాజు, భువనేష్, యుగంధర్, సాము, శేషాద్రి, జనార్ధన్, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో షెల్టర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పుంగనూరు: మదనపల్లి వైపు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఆ సర్కిల్లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ తన అంబేద్కర్ సర్కిల్లో ప్రధాన కూడలి కాబట్టి ఆ ప్రాంతంలో బస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వేసవికాలంలో ప్రయాణికులు మదనపల్లి వైపు వెళ్లాలంటే ఎర్రటి ఎండలో నిలబడాలని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కావున వెంటనే స్పందించి బస్సు సెంటర్ ఏర్పాటు చేసినందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రాముకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.అశోక్, ఎంఆర్‌పిఎస్ నాయకులు నరసింహులు, నాగరాజ, వెంకటరమణ, రమణారెడ్డి, రాజా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నూతన కోర్సులు ప్రవేశపెట్టాలి ఇన్‌ఛార్జి వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్:

దేశంలో యుజి, పీజీ స్థాయిలలో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ భద్రత అవకాశాలు కలిగినటువంటి భవిష్యత్తు కలిగిన నూతన రంగాలకు సంబంధించిన కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలను అందిపుచ్చుకుంటారని న్యూ ఢిల్లీలో ఎస్వీయూ ఇంచార్జీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సి. హెచ్. అప్పారావు న్యూ ఢిల్లీలో ప్రారంభమైన పిఎమ్ – ఉష జాతీయ కార్యశాలలో పాల్గొన్నారు. "ఉద్యోగ భవిష్యత్తు, నూతన రంగాల్లో కోర్సులు" అనే అంశంపై ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రెండు రోజులు ఏప్రిల్ 30, మే 1 నిర్వహిస్తోంది. కొత్త టెక్నాలజీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బయోటెక్నాలజీ వంటి రంగాలలో కొత్త కోర్సులు తీసుకురావాలని, విద్యార్థులకు భవిష్యత్తు ఉద్యోగ అవసరాలకు తగ్గట్లు నైపుణ్యాలు అందించవలసిన దిశగా పనులు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. రూసా కో ఆర్డినేటర్ ఆచార్య రమశ్రీ, రూసా సిఇఒ వంశీ రాయల్ల్ పాల్గొన్నారు.

'అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం'



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అంబేద్కర్ ఆశయ సాధనకు దళితులు కలిసికట్టుగా కృషి చేయాలని దళిత సంఘ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మహాసముద్రం దళితవాడలో విశ్రాంత ఉద్యోగి మహాసముద్రం క్రిష్ణన్ అధ్యక్షతన 134వ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షులు తుల్లిబల్లి అశోక్ బాబు, రాయలసీమ మాలమహానాడు అధ్యక్షులు, కార్యదర్శులు యమలా సుదర్శన్, పూతలపట్టు ప్రభాకర్లు, ఎన్జీవో సంఘ అధ్యక్షులు రాఘవులు, మూర్తి, రమేష్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు మన కృషి చేయాలని, రాజ్యాంగ పరిరక్షణ ప్రతి దళితుడి బాధ్యతగా స్వీకరించాలన్నారు. అంబేద్కర్ చిత్రపటాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు దుగ్గాని జయరాం, రాజకుమార్, వళ్ళత్తూరు ఉదయ్ కుమార్, పార్థసారథి, జానకిరామన్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వేసవి క్రీడా శిక్షణా తరగతులు ఈనెల 1వ తేదీ గురువారం నుండి ప్రారంభించనున్నట్లు డిఎస్‌డిఓ బాలాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బంగారుపాలెం ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో ఉదయం, సాయంత్రం శిక్షణా తరగతులు ఉంటాయని ఆసక్తి గల క్రీడాకారులు శిక్షణా తరగతుల్లో పాల్గొని క్రీడా నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని వాలీబాల్ కోచ్ మాజీ డిఎస్‌డిఓ.సుదర్శన్ నాయుడు తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు మాజీ వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు మురారి, ఖోఖో కోచ్‌గా మధు, కబడ్డీ కోచ్ అరవింద్ వ్యవహరిస్తారని ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ ముగిసిన తర్వాత సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా దృష్ట్యా వడదెబ్బ నుండి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు పాటించాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎండలు తీవ్రంగా ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వ్యాధిగ్రస్తులు వృద్ధులు పిల్లలు, ఎండలో తిరగరాదన్నారు. అనవసరంగా బయట తిరగడం మానుకోవాలన్నారు. బయటికి వెళ్లే క్రమంలో తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలని గొడుగు తలకు టోపి తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. తరచూ నీళ్లు, చల్లటి ద్రవాలు ఓఆర్ఎస్ కలిగిన నీరును తాగడం ఆరోగ్యానికి మంచిదన్నారు. మే నెలలో మరింత ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు వేసవి సెలవులు కావడంతో తల్లిదండ్రులు రక్షణలోనే ఉండి పిల్లలను బావులకు ఈతకు వెళ్ళినప్పుడు పెద్దల పర్యవేక్షణలోనే ఉండాలన్నారు.

ఆలయానికి భూ దానం చేసిన గిరిప్రసాద్

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణంలో వెలిసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవస్థాన పాలకమండలి చేపట్టిన భూ దాన కార్యక్రమానికి శాంతిపురం మండలం కర్లగట్ట గ్రామానికి చెందిన యూనిట్ ఇన్చార్జి గిరిప్రసాద్ రూ.15వేలు విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని అందుకున్న ఆలయ కమిటీ అధ్యక్షులు బిఎంకె.రవిచంద్రబాబు, పాలకమండలి సభ్యులు దాతను అభినందిస్తూ వారు వారి కుటుంబసభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. టిడిపి నాయకులు గోపీనాథ్, బాలు, మణిగోపాల్, జయరామ్ నాయుడు, మణి పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి విరాళాన్ని అందిస్తున్న గిరిప్రసాద్

గోపీనాథ్ యోగి జయంతి వేడుకలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణం బైరుగానిపల్లిలోని శ్రీ విశ్వశాంతి యోగ ఆశ్రమంలో డాక్టర్ గోపీనాథ్ యోగి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్రమ ఆవరణలో ఉదయం గణపతి హోమం, గురుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, రోడ్డు పక్కన గల అభాగ్యులకు భోజనం ప్యాకెట్లను అందజేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు అందజేశారు. అనంతరం రాత్రి సమయంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ట్రస్ట్ అధ్యక్షులు సంతోష్, కార్యదర్శి గణేష్ తెలిపారు.

మార్చురీ వద్ద కార్మిక సంఘాల ఆందోళన....

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళవారం భవనంపై నుండి పడి మరణించిన బి. శ్రీనివాసులు, తన్నీరు వసంత్, కె. శ్రీనివాసులు మతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వారి స్వగ్రామాలకు పంపడానికి సిద్ధం చేశారు. కార్మికుల అకాల మరణానికి ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా గుట్టుచప్పుడు కాకుండా మతదేహాలను తరలింపుపై సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైతే భవన యజమానిగా చెప్పుకుంటున్నారో కడివేటి అండాలయ్యకు వరసకు బావమరిది అయిన బి. శ్రీనివాసులుకు మాత్రం తాము చూసుకుంటామని అతని మతదేహాన్ని తీసుకొని వెళ్ళిపోతుండగా కార్మిక సంఘాల నాయకులు అడ్డుకొని, కార్మిక కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అక్కడే బైఠాయించారు. కె. శ్రీనివాసులు, తన్నీరు వసంత్‌లకు రూ.6.5 లక్షల రూపాయలు ఒక్కొక్కరికి ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగి మతదేహాలను ఖననం కోసం వారి స్వగ్రామాలకు తరలించారు.

తిరుమలనగర్ గ్రామపంచాయతీ ఇన్చార్జ్ సెక్రటరీగా మురళి

తిరుమల నగర్ గ్రామపంచాయతీ ఇన్చార్జి సెక్రటరీగా న్యూ మంగళం పంచాయతీ కార్యదర్శి మురళిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్వాతిశ్రీ ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రిలీవ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల మతికి బాధ్యుల్ని చేస్తూ జిల్లా కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి స్వాతిశ్రీ ని సస్పెండ్ చేయడం, ఈవోపీఆర్ డి మాధురికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే.



భవన నిర్మాణదారికి కార్మిక శాఖ నోటీసులు

మంగళవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ ప్లాట్ నెంబర్ 63లో నిర్మాణంలో ఉన్న భవనం పైనుండి పడి ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు మతి చెందడంతో భవన నిర్మాణదారికి కార్మిక శాఖ కమిషనర్ బుధవారం నోటీసులు జారీ చేశారు. కార్మిక చట్టం ప్రకారం కార్మికుల మతికి నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు.

'మేడే' రోజైనా ఎస్వీయూలో జీతాలు అందేనా..?

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది, టైం స్కేల్, ఇతర ఒప్పంద ఉద్యోగులు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా బోధనేతర సంఘం నేతలు మాట్లాడుతూ ఉద్యోగులు అరకొర జీతంతో ఇంటి బాడిగులు, నిత్యవసర వస్తువులు కొనుక్కోవడంతో పాటు కొన్ని వస్తువులకు సంబంధించి, ఇంటి వస్తువుల ఈఎంఐలు కట్టవలసి వస్తుందని అన్నారు. రెండు నెలలుగా డబ్బు చెల్లించకపోవడంతో ఈఎంఐలు లాప్స్ అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీతం ఎంత వచ్చినా ఉద్యోగులు కొన్ని కమిట్మెంట్స్ ఈఎంఐలు, ఎల్ఐసి పాలసీలు తదితరాలకు సంబంధించి చెల్లింపులు ప్రతినెలా చేస్తుండడం ద్వారా వారి యొక్క ఆదాయంలో 80శాతం ఇలాంటి ఖర్చులకు సరిపోతుందని అన్నారు. దీన్ని దష్టిలో ఉంచుకొని వర్సిటీ ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయి సచివాలయంలోని అధికారులతో సంప్రదించి సత్వరమే వేతన జీవుల జీతాలు అందేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే వర్సిటీ రిజిస్ట్రార్‌తో చర్చించినట్లు తెలిపారు. మేడే సందర్భంగా శ్రామికుల బతుకు జీవుల వేతన వేతనాలు అందేలా చూడాలని ఎస్వీయూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వరా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. మే డే సందర్భంగా ప్రభుత్వం శ్రమజీవులకు జీతాలు వేసి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆశిద్దాం.

'నగల' కోసమే హత్య...

శాంతమ్మ హత్య కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



శాంతమ్మ హత్య కేసులో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. స్థానిక అలిపిరి పోలీస్ స్టేషన్లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన జీవకోనలోని రాఘవేంద్ర నగరంలో సిరివెళ్ల శాంతమ్మ (64) హత్య జరిగిన విషయం విదితమే. మొదట్లో అనుమానాస్పద కేసుగా నమోదు చేశారన్నారు. తన ఇంట్లో అద్దెకుంటున్న వ్యక్తులే సంపద కోసం హత్య చేశారని వెల్లడించారు. 13 లక్షల విలువగల 129 గ్రాముల బంగారం,. వెండినగలు, 35 వేలనగదు స్వాధీనం చేసుకున్నారు. బిజిలి జగదీష్., ఉయ్యాల హర్షిత, బండి పవన్ కుమార్,. జమ్మలమడుగు శశిరేఖ., గూడూరు మురళి శాంతమ్మ ఇంటిలోని రెండో అంతస్తులో నివాసం ఉండేవారు. 4వఅంతస్తులో నివాసముంటున్న బిల్డింగ్ యజమాని శాంతమ్మతో చనువుగా ఉంటూ హత్య చేసేందుకు ప్రణాళిక వేశారు. పథకం ప్రకారమే హత్య చేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఇంటిలో ఉన్న బంగారునగలు డబ్బు కాజేసి నిందితులు పారిపోయారన్నారు. బిజిలి జగదీష్ పై ఇప్పటికే కిడ్నాప్, హత్యా నేరాల కేసులు ఉన్నాయి. ఉయ్యాల హర్షిత తండ్రి పై 17 ఎర్రచందనం కేసులు ఉన్నాయని వెల్లడించారు. తిమ్మినాయుడుపాలెం బస్ స్టాప్ వద్ద తచ్చాడుతుండగా నిందితుల్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్కు తరలించామని, సహకరించిన పోలీసు అధికారులను, సిబ్బంది అభినందించారు. ఈ సమావేశంలో అలిపిరి సీఐ రామ్ కిషోర్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హై స్కూల్ (న్యూ జనరల్ క్యాంపస్) 48వ వార్షికోత్సవం "రాగ్ రంగ్ -2025" పేరుతో తిరుపతి మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ చైర్మన్ కె ఎస్ వాసు మాట్లాడుతూ స్కూల్ డే అనే పదాన్నే పూర్తిగా మర్చిపోయి కేవలం ఎడ్యుకేషన్ .. ఎడ్యుకేషన్ అనే పంథాలో కాకుండ కేవలం ఎడ్యుకేషన్ మాత్రమే వుంటే సరిపోదు, పిల్లలలో దాగివున్న సజనాత్మకతను వెలికి తీయడం, వారిలోని సామర్థ్యమును వారే గుర్తించగలిగేలా, దాదాపు 1500 మంది విద్యార్థులలో వున్న ప్రతిభా పాటవాలను 20 కల్చరల్ ఐటమ్స్ లో చూపించడమే రాగ్ రంగ్-2025 ప్రత్యేకత అన్నారు. నర్సరీ, ఎల్.కే.జి, యు.కే.జి. చిన్నారుల కోసమే ప్రత్యేకంగా కాన్వకేషన్ డేని నిర్వహించడం శ్రీ వెంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ వారికే సాధ్యమన్నారు. 20 కల్చరల్ ఐటమ్స్ లో ప్రతి ఐటమ్ కు థీమ్ సంబంధించినదే, దానిలో దేశభక్తి, దైవభక్తి, గురుభక్తి, తల్లితండ్రులపై భక్తి, సత్ ప్రవర్తనలపైన నత్య రూపకంలో, నాటక రూపంలో ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. వెల్కమ్ అడ్రస్ నుండి జాతీయగీతం వరకు పూర్తిగా విద్యార్థులే, (టీచర్స్ పర్యవేక్షణలో) ఎంతో ఉత్సాహంగా జరిపించడం చూపరులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్.యం. పి. సప్నాలత , ప్రైమరి ఇన్ చార్జ్ బి. కవితశ్రీ, కిండర్ గార్డెన్ ఇన్ చార్జ్ సి.భువనేశ్వరి పాల్గొన్నారు.



నేడు సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,230 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత ఫించన్ దారులకు సూమారు 111.84 కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు మే ఒకటవ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు మే 1 వ తారీఖున పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డిఎల్డిఓలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పింఛను దారులకు ముందుగా నమస్కారం పెట్టి గౌరవంగా చిరునవ్వు తో పింఛను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఏ కారణం చేతనైనా పింఛను తీసుకోని లబ్ధిదారులకు వారి యొక్క చరవాణి కి సందేశం పంపాలన్నారు.వీరికి రెండో తేదీ మధ్యాహ్నం 2-5 గంటల మధ్య పంపిణీ చేయాలన్నారు.



ప్రకాశం మున్సిపల్ పార్కులో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రకాశం మున్సిపల్ పార్కులో వాకర్స్ అసోసియేషన్ తరపున వాకర్స్ సభ్యులకు వేసవితాపం దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ, అంబలి వితరణ కార్యక్రమాలు నెలరోజుల నుంచి దాతల సహాయంతో వాకర్స్ అసోసియేషన్ నాయకులు వితరణ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మజ్జిగ పంపిణీ వితరణ నెలరోజులు పూర్తిచేసుకుని ఈరోజు ముగింపు చేస్తున్న సందర్భంగా అతిథిగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కష్ణప్రసాద్ విచ్చేసారు.

కులగణన' నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తామని ప్రకటించడం పట్ల బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పటినుంచో జనగణన, కులగణన చేయాలని బీసీలు అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో కులగణన 1931లో మాత్రమే జరిగింది. 94 సంవత్సరాల తరువాత దేశంలో మళ్లీ కులగణన చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.

మంచు మోహన్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులపై అన్యాయమైన ఆర్థిక వసూళ్లు, మెస్ బిల్లుల పేరుతో దోపిడీ, హాల్ టికెట్లను నిలిపివేత వంటి ఘటనలపై భారత విద్యార్థి ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. యూనివర్సిటీ యాజమాన్యం గత కొన్ని సంవత్సరాలుగా డే స్కాలర్స్ విద్యార్థుల నుంచి నెలకు రూ.20వేల వరకు మెస్ బిల్లులు వసూలు చేస్తోంది. విద్యార్థులు మెస్ ఉపయోగించకపోయినా ఈ బిల్లులను తప్పనిసరిగా చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తుంది. ఈ దోపిడీ తారాస్థాయికి చేరి, మే 1వ తేదీ నుండి ప్రారంభమయ్యే నాలుగో సెమిస్టర్ పరీక్షల కోసం హాల్ టికెట్లు ఇవ్వకుండా, పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, ఫైన్లు పూర్తిగా చెల్లించిన తర్వాత మాత్రమే జారీ చేస్తామని యాజమాన్యం బెదిరిస్తోంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు అక్బర్, జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఈ విధమైన ఆర్థిక దాడులు అన్యాయమని, ఇది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే చర్యని, యూనివర్సిటీ మేనేజింగ్ ట్రస్టీ, చైర్మన్ మంచు మోహన్ బాబు, ట్రస్టీ మంచు విష్ణు పై క్రిమినల్ కేసు నమోదు చేసి, బాధిత విద్యార్థులకు హాల్ టికెట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎపిఎస్సిహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తికి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ కి ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే, మోహన్ బాబు యూనివర్సిటీని ముట్టడించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

ప్రత్యేక హోదాకై సిఎం చొరవ చూపాలి : సిపిఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించేలా సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చొరవ చూపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ మోడీ పర్యటన కోసం రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు ,మంత్రులు విజయవాడ చుట్టూ చకోరి పక్షుల్లా నిరీక్షిస్తున్నారని అన్నారు...మోడీ శంకుస్థాపన చేసి పది ఏళ్ళు గడిచి అమరావతి స్మశానంలా మారిందని తెలిపారు...మోడీ దగ్గర చంద్రబాబు కన్నా పవన్ కళ్యాణ్ కు ప్రాధాన్యత ఎక్కువ గా ఉందని పేర్కొన్నారు.. మోడీ అమరావతి కోసం ఆనాడు ఢిల్లీ నుండి నీరు, మట్టి తెచ్చి చంద్రబాబు మొహంపై కొట్టారన్నారు...కొత్త గా ఏర్పడ్డ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇవ్వాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు...ప్రత్యేక హోదా ఇస్తే మోడీని బిక్షం అడగాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు.ప్రత్యేక హోదా విషయంలో మోడీ ని చంద్రబాబు ఎందుకు ప్రశ్నించడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ నష్టపరిహారం చెల్లించాలి

క్రిస్ సిటీ సెజ్‌లో అర్హులందరికీ నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు అన్నారు. చిల్లకూరు మండలంలోని క్రిస్‌సిటీ సెజ్‌లో భూములకు 2016, 2017 సంవత్సరంలో ప్రభుత్వం సర్వే చేసిందన్నారు. 267 ఎకరాలు సాగుబడిలో ఉన్న రైతులకు ఎలాంటి పత్రాలు లేవనే సాకుతో అధికారులు నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం చేతికి వచ్చిన పంటలను అధికారులు ధ్వంసం చేయడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ , సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ , చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా ప్రజా రవాణా అధికారి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



జిల్లా ప్రజా రవాణా అధికారి నరసింహులు ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక డిపిఆర్ఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని పలు డిపోల మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1992లో ఏపీఎస్ఆర్టీసీలో ట్రైనీ ఆఫీసర్గా చేరిన నర్సింహులు డిపో మేనేజర్ గా, డివిజనల్ మేనేజర్ గా, వర్క్ మేనేజర్ గా, డిప్యూటీ సిటిఎంగా, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వహించి, తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారిగా విధులు నిర్వహిస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమన్నారు. 33 సంవత్సరాలు సంస్థ అభివద్ధికి వివిధ హోదాల్లో ఆయన చేసిన కషిని కొనియాడారు. అనంతరం గజమాలతో ఆయన సత్కరించారు. పర్సనల్ ఆఫీసర్ షహజాద్, అకౌంట్ ఆఫీసర్ చంద్రమణి, డిప్యూటీ సిటీఎం విశ్వనాథ్, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.

ఎస్వీయూ డిగ్రీ అకడమిక్ షెడ్యూల్లో మార్పులు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డిగ్రీ అకడమిక్ క్యాలెండర్‌ను ఏప్రిల్ 30వ తేదీకి ముగిసి జూన్ మధ్యలో ఓపెన్ చేస్తారని అకడమిక్ షెడ్యూల్ నిర్ణయించారు. అయితే సడన్గా ఈరోజు వర్సిటీ ఉన్నతాధికారులు అకడమిక్ క్యాలెండర్లో మార్పులు తీసుకొస్తూ మే 10 వరకు పని దినాలుగా ప్రకటించడంతో డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బుధవారం వర్సిటీ రిజిస్ట్రర్, ఇన్చార్జి ఉపకులపతి తో మాట్లాడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే మార్చితో ప్రారంభమైన ఎండలు, వేడి, ఉక్క పోతతో విద్యార్థులు పరీక్షల్లోనే అస్వస్థతకు గురై అనారోగ్యం పాలవుతున్నారు. ముందుగా సెలవులు ప్రకటించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

విద్యా విధానాల అమల్లో అధ్యాపకులదే కీలకపాత్ర

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యా విధానాల అమల్లో అధ్యాపకులదే కీలకపాత్ర అని ఏబీఆర్ఎస్ఎమ్ కార్యదర్శి గుంత లక్ష్మణ్ అన్నారు. ఏబీఆర్ఎస్ఎమ్ తిరుపతి శాఖ ప్రతినిధుల సభ బుధవారం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏబి ఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రస్తుతము కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న నూతన జాతీయ విద్యా విధానం అమలులో ఉపాధ్యాయులు, అధ్యాపకులు కీలక పాత్ర వహించవలసి ఉంటుందన్నారు. భారతదేశ విద్యా రంగంలో సవాళ్ళు, మార్పులు అనే అంశముపై జూలై 26, 27 తేదీల్లో చెన్నైలో అంతర్జాతీయ సదస్సు ఏబిఆర్ఎస్ఎం నిర్వహిస్తుందని తెలిపారు. ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ బుల్లిదాస్, డాక్టర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్రైం న్యూస్

పుల్లూరు అడవి సమీపంలో గుర్తు తెలీని శవం లభ్యం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని పుల్లూరు పెద్దచెరువు వద్ద గుర్తు తెలియని శవం బయటపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఎగువ కమ్మకండ్రిగ కండ్రిగ పంచాయతీ రానిపురం గ్రామానికి చెందిన కొందరు బీడీ తయారీ కోసం ఉపయోగించే తుమ్మికి ఆకు కోసం బుధవారం అడవికి వెళ్లారు. పుల్లూరు పెద్ద చెరువుకు ఎగువన ఎముకలు తేలిన శవం కనబడడంతో చూసినవారు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. అనంతరం ఎస్ఆర్ పురం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి 8 గంటలకు స్థానికుల సహాయంతో శవం ఉన్నచోటికి చేరుకున్నారు. శవాన్ని పరిశీలించిన పోలీసులు మృతి చెందినది పురుషుడు అయి ఉండొచ్చు అని భావిస్తున్నారు. రెండు మూడు నెలల క్రితమే మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. స్థానిక విఆర్ఓ ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి ఆత్మహత్య లేదా హత్య అన్న కోణంలో దర్యాప్తు చేస్తామని ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ తెలిపారు.


ఎముకలు తేలిన శవం

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

గాండ్ల పూర్ణచంద్రా, తండ్రి గాండ్ల జగన్నాథం శెట్టి, ఇంటి నెం.1-217, కాణిపాకం గ్రామం, (పోస్టు), ఐరాల మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ అయిన నా యొక్క భూమి డాక్యుమెంట్ నెం.243/2008 సబ్ రిజిస్ట్రార్, చిత్తూరు. 02.04.2025వ తేది దినమున చిత్తూరు కెనరా బ్యాంక్ నుండి కాణిపాకం వెళుతుండగా జారిపోయినవి. ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు పై అడ్రసులో కాని, ఈ క్రింది నెంబరుకు తెలియజేసినచో తగిన పారితోషికం ఇవ్వబడును.

సెల్: 7981438137
గాండ్ల పూర్ణచంద్ర.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయం: మాజీ ఎంపీపీ



ప్రజాశక్తి -రామచంద్రాపురం: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎంపీపీ డి బిందు మాధవి అన్నారు. మండలంలోని అనుపల్లి పంచాయతీ గోకులాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు విద్యా మంత్రి లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే పులివర్తి నాని రూ. 13 లక్షల రూపాయలు సర్వ శిక్ష అభియాన్ నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలోనే శిక్షణ పొందిన, అనుభవం ఉన్న ఉపాధ్యాయుల ద్వారా విద్య బోధన లభిస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలలో ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే ఉత్తమ ఉత్తీర్ణత శాతం సాధించారనే విషయం ఆమె గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. నాణ్యమైన విద్యను అందించేందుకు మోడల్ స్కూళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మోడల్ స్కూల్ లో చదివే విద్యార్థులకు రవాణా ఛార్జీలు, ఉచిత పుస్తకాలు, భోజనం, యూనిఫామ్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ ఇంజనీరింగ్ అధికారి చంద్ర, స్థానిక టిడిపి నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, జవహర్ రాయల్, మహేష్, పంతల చిట్టిబాబు, మునిరత్నం నాయుడు, ప్రకాష్, నరేష్ రెడ్డి, రమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట. పుత్తూరు, నారాయణవనం పోలీస్ స్టేషన్లను. తిరుపతి ఎస్పి హర్షవర్ధన్ రాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో భాగంగా అన్ని స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించామని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నోటీసు బోర్డులో నూతన చట్టాలను రాసి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. వివిధ కేసుల్లో నమోదైన వాహనాలను పరిశీలించిన కోర్టు అనుమతి తీసుకుని డిస్పెక్ట్ చేయాలని ఆదేశించారు. పుత్తూరు డివిజన్ పరిధిలో ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక చొరవ చూపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవికుమార్, సి సురేంద్ర నాయుడు, ఎస్ఐ ఓబులేష్, వడమాల పేట సీఐ సాధి ఆలీ, ఎస్ బి ఎస్సై ధర్మారెడ్డి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

అందాల పోటీలు సంస్కృతికి విరుద్ధం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అందాల పోటీలు సంస్కృతికి విరుద్ధమని , మహిళలు స్వశక్తితో పైకి ఎదగాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని బొడ్డు చౌక ప్రాంతంలో ఉన్న లలిత ఎక్స్ క్లూజివ్ అవుట్ లెట్ – కావేరి ఫుడ్ ప్రొడక్ట్స్ ను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందు గూడూరు పోటు పాలెం జాతీయ రహదారి వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం కావేరి ప్రొడక్ట్స్ షాప్ ప్రతినిధులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు శాలువా , పుష్ప గుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా కె నారాయణ మాట్లాడుతూ త్వరలో తెలంగాణలో మహిళలకు అందాల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందాల పోటీల పేరుతో మహిళలను విధిల్లోకి తీసుకు రావడం ఎంత వరకు సబబు అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. మహిళల ఆర్థిక స్వాలంభన కోసం ప్రభుత్వాలు పని చేయాలని సూచించారు. ఎంతో పేరు , ప్రఖ్యాతులు కల్గిన లలిత బ్రాండ్ ప్రొడక్ట్స్ ను గూడూరు ప్రజలకు అందిస్తున్న కావేరి ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రతినిధులు పావని , సునీల్ కుమార్ ను అభినందించారు.ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ కె.రమణయ్య , డాక్టర్ నిర్మల ,కావేరి ఫుడ్ ప్రొడక్ట్స్ యజమానులు పావని , సునీల్ కుమార్ , సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామ నాయుడు , సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ , సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ , చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

అందరి ఆమోదంతోనే పనులు

మున్సిపల్ ఛైర్మన్ ఎ హరి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాల్టీలో కౌన్సిలర్ల అందరి ఆమోదంతోనే పనులు చేస్తున్నామని నిధులు ఎలాంటి దుర్వినియోగం కాలేదని పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాల్టీ సర్వ సభ్య సమావేశం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండా చదివి వినిపించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపాల్టీలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉందని తాము ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మున్సిపల్ పార్కులో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పదేపదే చెప్పినా ఆ పనులు చేయడం లేదని పార్కులో వాకింగ్ చేసేవారు, మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్నారని, వారి కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పదే పదే చెప్పినా వాటికి నిధులు అనుమతి లేదని చెబుతున్నారు. ఉరవ కాలువ అక్రమణకు గురవుతోందని, సర్వే చేసి వర్షపు నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నాలు నాయుడు మాట్లాడుతూ కాశ్మీరు ఉగ్రవాది దాడులను నిరసిస్తూ మృతులకు నివాళులర్పించారు. చెత్త సేకరణకు 13 బ్యాటరీ వాహనాలు వున్నాయని అందులో రెండో మూడో వినియోగంలో వున్నాయని, మిగిలినవి మూల పడేశారన్నారు. వాటిపై దృష్టి సాధించాలని కోరారు. వేసవి దృష్ట్యా నీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మరో కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డుల్లో కౌన్సిలర్లకు తెలిసి పనులు చేస్తే వార్డు ప్రజలకు చెప్పేందుకు వీలు వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ, వైస్ ఛైర్మన్ డి జయప్రకాష్, కౌన్సిలర్లు, డి ఈ చంద్రశేఖర్, ఏఈలు ఇతర శాఖ. అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రపంచ కార్మిక దినోత్సవ
ఎడివిటి ఫీచర్ - చిత్తూరు జిల్లా
పేజీలు -8
ప్రత్యేక సంచిక
గురువారం 01 మే 2025



కార్మిక ఉద్యమాల ఫలితమే(డే)



- శ్రామికులు సాధించుకున్న హక్కులకు నిదర్శనం
- నేడు వాడవాడలా ఎగరనున్న ఎర్రజెండా

సాధారణంగా ప్రజలు మేడే అంటే ఎక్కడో ఒకచోట ఏదో ఒక ఎరుపు జెండా ఎగురవేసి సెలవు దినం మాత్రమే అనుకుంటుంటారు. కానీ శ్రామికుల పోరాటంతో ఆవిర్భవించిన దినంగా ఎందరికి తెలుసు. కార్మికుల హక్కుల పోరాటాలతో పుట్టుకొచ్చిన పండుగ దినమే ఈ మేడే. ఏడాదిలో ఒక్కరోజు కార్మికులు తమ మనోభావాలను సగర్వంగా గొంతెత్తి తెలుపుకుని పండుగ రోజు.

ప్రజాశక్తి- పూతలపట్టు: మేడే అనేది ప్రతి ఏడాది మే 1న జరుపుకునే ఒక అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం. కార్మికుల హక్కులు, విజయాలు వారి శ్రమను గౌరవించే ఒక సందర్భం.. ఈ రోజున కార్మికులు తమ హక్కుల కోసం పోరాడిన మహనీయులు ప్రస్తుతం వారికి అండదండుగా ఉన్న నాయకులను గుర్తు చేసుకునే రోజు. అదేవిధంగా వారి భవిష్యత్తు కోసం పోరాటానికి ప్రేరణ పొందడానికి ఈరోజు ఎంతో ఉపయోగకరమని 2లో

క్వారీ కార్మికులకు కనీస వేతనాలు సౌకర్యాలు కల్పించాలి : సిఐటియు

వార్త.. 4 లో

శ్రమజీవి జగతికి మూలం.. చమటోర్చక కదలదు కాలమా..

వార్త.. 5 లో

ప్రశాంత వాతావరణంలో 'నీట్'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : మే 4న జరగనున్న నీట్ -2025 ప్రవేశ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసి విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నీట్ -2025 ప్రవేశ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య, అగ్నిమాపక శాఖ, ఆర్టీసి, ఇతర సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలు, జేసి జి.విద్యాధరితో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎఎంఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో 2లో

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టండి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు గానే ప్రణాళికలు రూపొందించుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపిడిఓలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో అన్ని మండలాల ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలతో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. మండల స్థాయిలో సురక్షిత తాగునీటిని సరఫరా చేసే బాధ్యత ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రెటరీలదే అని, వీటి పర్యవేక్షణ బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులదని అన్నారు. వాటర్ ట్యాంకులను మాసానికి ఒకసారి శుభ్రం చేస్తున్నదీ లేనిది ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షణ చేయడం, బయోలాజికల్ టెస్టింగ్ చేసి సురక్షిత నీటిని అందజేసే విషయంలో రెండు శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసినట్లు జియో ట్యాగింగ్‌తో ఫోటోలు తీసి అందుకు సంబంధించిన రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయని పంచాయతీ సెక్రెటరీలకు నోటీసులను ఇవ్వాలన్నారు. ఎంపిడిఓలు ఈ విషయంలో క్షేత్రస్థాయిలో పంచాయతీల వారీగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పర్యటించి సురక్షిత మంచి నీరు ప్రజలకు అందుతున్నది లేనిది పరిశీలించాలన్నారు. అలాగే ఈ పర్యటనలో ఎక్కడైనా నీరు కలుషితం అవుతున్నట్లు గుర్తిస్తే వెంటనే అందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి కొరకు ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో అవసరమైన చోట బోర్ల డీపెనింగ్, ట్రాన్స్పోర్టేషన్ ప్రతిపాదనలను పంపే విషయంలో పూర్తిగా విచారించిన అనంతరం ప్రతిపాదనలను పంపాలని ఆదేశించారు. ఎంపిడిఓలు వైద్యశాఖ అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించడం ద్వారా నీరు కలుషితం కావడం ద్వారా వ్యాప్తి చెందుతున్న వ్యాధుల విషయం తెలుస్తుందని, అందుకు అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ దిశగా పని చేయాలన్నారు. తాగునీటి పరిష్కారానికి నిధుల కొరత లేదని, పంచాయతీ నిధుల నుంచి జిల్లా పరిషత్ నుండి నిధులను కూడా కేటాయించడం జరుగుతుందని అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమస్య నివారణపై దృష్టి పెట్టాలన్నారు. కొత్త బోర్లు వేసిన చోట పైప్‌లైన్, పంపు సెట్, మోటర్, విద్యుత్ కనెక్షన్ అన్ని ఇచ్చిన తరువాతనే ఆ పని పూర్తి అయినట్లు అవుతుందని తెలిపారు. జిల్లాలో గత 15 రోజుల వ్యవధిలో 32 ట్రాన్స్పోర్టేషన్ టై అప్‌ల ద్వారా నీటి సరఫరా చేపట్టామని, 210 పంపు సెట్‌లు మరమ్మతులకు గురి కాగా వాటిని పూర్తిగా రిపేర్ చేసి వాడుకలోకి తెచ్చామని, 155 చోట్ల పైప్ లైన్‌ల లీకేజి గుర్తించి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసినట్లు రుజువైతే కఠినచర్యలు తప్పవని, ప్రజాప్రయోజనాలకు ప్రభుత్వ నిధులను ఖర్చు చేయాలని పంచాయతీ సెక్రెటరీలు వారి భాధ్యతలను గుర్తెరిగి పనిచేసేలా ఎంపిడిఓలు పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో రవికుమార్ నాయుడు, డిపిఓ సుధాకర్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

కార్మిక ఉద్యమాల ఫలితమే(డే)

పలువురు కార్మికులు అభిప్రాయాలను వ్యక్తం చేసే మహా దినం. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు మే డేను కార్మికుల శ్రమకు గుర్తింపుగా సెలవు దినంగా జరుపుకోవడం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా ఇంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న ఏకైన దినోత్సవం కార్మికుల దినోత్సవం మేడే అనడంలో సందేహం లేదు. అన్ని వర్గాల కార్మికులు కలిసికట్టుగా తన మనోభావాలకు తగ్గట్టుగా జరుపుకునే ఏకైక పండుగ మేడే.

ఉద్యమాలకు చిహ్నం..

మేడే కార్మిక ఉద్యమాలలో భాగమైన చారిత్రక సంఘటనలను గుర్తు చేస్తుంది. 1886లో అమెరికాలో 8 గంటల పని దినం కోసం జరిగిన పోరాటాలు.. కార్మికుల హక్కులు, సురక్షితమైన పని పరిస్థితులు, నాణ్యమైన వేతనాల కోసం పోరాడి సాధించుకున్న రోజే ఈ మే డే. స్వతంత్రం కోసం భారతీయులు చేపట్టిన ఉద్యమాలు లాగానే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కార్మికులు తమ హక్కుల కోసం పోరాడి సాధించుకున్న పర్వదినంగా ఈ మే డే నుంచి అభివర్ణించవచ్చు.

సమాజంలో మార్పు కోసం..

మేడే రోజు కార్మికులకు మద్దతుగా జరిగే ప్రదర్శనలు, ర్యాలీలు సమాజంలోని కష్టజీవుల ప్రోత్సాహానికి దోహదపడుతుంది. కార్మికుల శ్రమ హక్కులను గౌరవించేందుకు ఒక సందర్భంగా చెప్పుకోవచ్చు. ఈ రోజున కార్మికులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వ అధికారులు సైతం ముందుకొస్తుంటారు.

కమ్యూనిస్టుల సహకారం..

కార్మికులు నేడు వారి హక్కులను సాధించుకుంటూ మూడు పూటలా తమ కడుపు నింపుకుంటున్నారంటే అది కమ్యూనిస్టుల పోరాటాల ప్రతిఫలమే. ముఖ్యంగా భారతదేశంలో కమ్యూనిస్టులు రాజకీయ శక్తులకు ఎదురు నిలబడి పోరాటాలు చేస్తుండడంతో కార్మికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా కమ్యూనిస్టులు అడ్డంగా నిలబడి ఆదుకుంటారు కనుకనే కార్మికులు మేడే రోజున కమ్యూనిస్టులకు చిహ్నమైన ఎర్ర జెండాను ఎగురవేస్తుంటారు.

'మా భూమిని కబ్జా చేస్తున్నారు'

రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రక్షణ కల్పించాలని కోరుతూ జీడి నెల్లూరు మండలం తూగుండ్రం రెవెన్యూ పిల్లారి కుప్పం గ్రామానికి చెందిన సుందర రాజు, భార్య రుక్మిణి వారి కుటుంబ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో సుందర్ రాజు కుమారుడు పురుషోత్తం మాట్లాడుతూ తన తండ్రి సుందరరాజు 2013వ సంవత్సరం గంగాధర నెల్లూరు నియోజకవర్గం, తూగుండ్రం రెవెన్యూ, పిల్లారి కుప్పం గ్రామంలో సర్వే నెంబర్లు 374 సబ్ డివిజన్ నెంబర్లు 374 /9ఏ, 9బి, 10, సర్వే నెంబర్లలో గల 27 సెంట్లు భూమిని తన తల్లి గారైన రుక్మిణి పేరుపై కొనుగోలు చేయడం జరిగిందని ఇందుకు సంబంధించి రిజిస్టర్ డాక్యుమెంటలతోపాటు, వన్ బి కలదని, గత కొద్ది రోజుల క్రితం తాము గ్రామంలో లేని సమయంలో కబ్జా చేసేందుకు అదే గ్రామానికి చెందిన భూషణ్, కరుణాకర్, సుధాకర్, జయచంద్ర, భాస్కర్ శెట్టి, జయచంద్ర మందిడి అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌డిఓ కార్యాలయం నుంచి సర్వేయర్లు సర్వేచేసి హద్దుల నిర్ణయించారని తెలిపారు. చట్టపరంగా తమకున్న భూమిని కబ్జాదారు నుండి కాపాడి రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.



మూడో రోజు కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమ్మె

ఆశ యూనియన్ మద్దతు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం 3వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు మద్దతుగా ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ నుండి పీహెచ్‌డీ వరకు ఉన్నత విద్య చదివినప్పటికీ వారు చేస్తున్న ఉద్యోగానికి భద్రత లేకపోవడం దారుణమన్నారు. ఒక నిర్దిష్టమైన పని లేకుండా రకరకాల పనులు చేస్తూ పనిభారం పెంచారని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌డబ్ల్యూ ఉద్యోగులతో సమానంగా వేతనాల చెల్లించాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సిలో ఓపి దగ్గర నుంచి అన్ని రకాల పనులు చేస్తూ గర్భిణీలకు టీబీ రోగులకు అన్ని రకాల వైద్య సలహాలు, సౌకర్యాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇలాంటి వారి కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్యరంగంలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలని నిరంతరం పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కూడా తీసివేయడం ఏమిటని ప్రశ్నించారు. గర్భిణీలు టీబీ రోగులు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఎవరూ కూడా బాధపడకుండా వారికి సౌకర్యాలు అందించాలని అనుకుంటే వెంటనే కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేసి వారి సమ్మెను విరమింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రోజురోజుకి అన్ని ప్రజాసంఘాలు వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు మద్దతుగా ఉంటామని తెలిపారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి చట్టాలను స్థాపనకు సబ్సిడీ (రాయితీ)తో కూడిన బ్యాంకు రుణాల మంజూరు కొరకు అర్హులైన మైనారిటీలు, క్రిస్టియన్ మైనారిటీల నుంచి అపోబ్మ్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే ప్రభుత్వ వెబ్సైట్ నుంచి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానించడమైనదని జిల్లా మైనారిటీ ఆర్థిక సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు కే.హరినాథ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి ముస్లిం మైనారిటీలకు 916 యూనిట్లు రూ.14.09 కోట్ల లక్ష్యంను ఇవ్వడం జరిగిందని, క్రిస్టియన్ మైనారిటీలకు 5 యూనిట్లు 0.0950 కోట్ల లక్ష్యంను ఇవ్వడం జరిగిందన్నారు. జనాభా ప్రాతిపదికన జిల్లాలోని అన్ని మండలాలకు మునిసిపాలిటీలకు ఆయా ప్రాంత బ్యాంకు బ్రాంచ్‌లకు లక్ష్యాలను నిర్దేశించడమైనదన్నారు. అందుకుగాను ఆన్లైన్ దరఖాస్తు చేసుకొనుటకు **అర్హతలు:** 1. తెల్లరేషన్ కార్డు కలిగి యున్న ప్రతి ముస్లిం, క్రిస్టియన్లు అర్హులు, 2. ఆధార్ కార్డు కలిగి ఉండాలి, 3. లక్ష్యాలు నిర్దేశించబడిన బ్యాంకు పరిధిలో నివాసం ఉండాలి, 4. చిత్తూరు జిల్లాలో నివసించుచున్న వారు మాత్రమే అర్హులు, 5. లబ్దిదారుల వయస్సు 21 నుండి 55 సంవత్సరాలులోపు ఉన్నవారు అర్హులు, 6. మైనారిటీ అభ్యర్థులు తహశీల్దార్ వారి నుండి పొందిన కాస్ట్ సర్టిఫికెట్ (బిసి- ఈ, బిసి- బి, ఓసి, ముస్లిం) ఉన్నవారు అర్హులు, 7. క్రిస్టియన్ మైనారిటీలకు తహశీల్దార్‌చే జారీ చేయబడిన బిసి- సి, ఓసి- సి కిస్టియన్ మతంకు చెందినట్లు ధృవీకరణ పత్రం లేదా గుర్తించబడిన చర్చిల నుండి బాప్తిజం పొందినట్లు ధృవీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. కావున ఆసక్తి గల మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్,) వెంటనే ప్రభుత్వ వెబ్సైట్ ఆన్లైన్ మే 25వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవల్సిందిగా ఆ ప్రకటనలో తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

ప్రశాంత వాతావరణంలో నీట్

పరీక్షలకు హాజరు కానున్న 710 మంది విద్యార్థులు


ప్రవేశాల కొరకు ఎన్‌టిఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహిస్తున్న నీట్ (నేషనల్ ఎల్జిబ్లిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్షలు జిల్లా కేంద్రంలోని పివికేఎన్ డిగ్రీ కళాశాలలో (432 మంది) సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల (278 మంది)ల్లో మే 4న ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద, ప్రశ్నా పత్రాలు భద్రపరచే ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేయాలని పోలీస్ ఎస్కార్ట్‌ల సహాయంతో ప్రశ్నా పత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని, జనరేటర్‌లను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను, పరీక్షా సెంటర్లకు నిర్దేశించిన ప్రాంతం అవతల విద్యార్థుల తల్లిదండ్రులు వేచి ఉండడానికి షామియానా, నీటి వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షలకు హాజరగు విద్యార్థులు సరైన సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా హాల్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని, అత్యవసర వైద్యసేవ నిమిత్తం ఆంబులెన్స్, ఫైర్ ఇంజిన్ ఏర్పాటు ఉండాలన్నారు. పరీక్షా హాలులోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు మొబైలు ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు. మొబైలు ఫోన్లను భద్రపరచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో రెవెన్యూ తరపున, పోలీస్ తరపున ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో సీటింగ్ అరేంజ్మెంట్, లైట్‌లు, ఫ్యాన్ లు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ ప్రశ్నా పత్రాలను ఆర్మ్డ్ పోలీసులతో కూడిన ఎస్కార్ట్‌తో పరీక్షా కేంద్రాలకు తరలించాలని, దీన్ని వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతామని అన్నారు. డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్, డిఈఓ వరలక్ష్మి, ఆర్డిఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కుల వివక్షను ఎత్తిచూపిన 'మాలపిల్ల'

తెలుగులో న్యూ సినిమా మూవ్‌మెంట్ ఇటీవలి కాలంలో మొదలైందని కొందరు అపోహపడొచ్చు. కానీ, అది నిజం కాదు. తెలుగు చిత్రాలు ప్రారంభమైన తొలిదశలోనే గూడవల్లి రామబ్రహ్మం ఆ పనికి శ్రీకారం చుట్టారు. 'భక్తప్రహ్లాద' వంటి పౌరాణికాలు ఒకవైపు నిర్మాణమవుతూ ఉంటే, జాతిని చైతన్యపరచడానికి మరోవైపు రామబ్రహ్మం కంకణం కట్టుకున్నారు. అంటరానితనం అడుగంటాలని, కుల వ్యవస్థను కూకటివేళ్ళతో పెళ్ళగించి వేయాలని ఒక మహోన్నతమైన సంస్కరణ వాదంతో రూపొందించిన చిత్రం 'మాలపిల్ల!' బ్రాహ్మణాధిక్యత గల అలనాటి సమాజంలో మాలల దుస్థితి ఎలుగెత్తి చెప్పడమే కాకుండా, ఇతర కులాలవారు వారిని పెళ్ళాడి వారిని మనుషులుగా గుర్తించాలని కూడా ఆ చిత్రం సూచించింది. పైగా, మనుషులంతా ఒక్కటేనన్న సందేశాన్నిచ్చింది.

తెలుగులో వెలువడ్డ మొదటి సాంఘిక చిత్రం–'ప్రేమ విజయం'. అది 1936లో వెలువడింది. కాని, విజయవంతం కాలేదు. రెండు సంవత్సరాల తర్వాత 1938లో వచ్చిన 'మాలపిల్ల' సామాజిక సంస్కరణకు ఉద్దేశించి వెలువడింది. ఆ చిత్రం తెలుగువారినే కాకుండా తమిళులను కూడా విశేషంగా ఆకర్షించింది. అవి భారత స్వాతంత్ర్యం కోసం అహింసా పద్ధతిలో పోరాటాలు సాగుతున్న రోజులు. సహాయ నిరాకరణోద్యమం, సత్యాగ్రహం నిత్యజీవితంలో భాగమైన రోజులు. ఆ రోజుల్ని, ఆనాటి సమకాలీన సాంఘిక పరిస్థితుల్ని యథాతథంగా చిత్తశుద్ధితో విప్లవ స్ఫూర్తితో ఆ చలనచిత్రాన్ని చిత్రీకరించారు గూడవల్లి రామబ్రహ్మం. "లేరా లేరా నిద్దుర మానర హరిజన వీర కుమారా / మానవులే నిను మాల మాలయని దూరము చేసిరి కదా?" అనే పాటతో చిత్రం ప్రారంభమవుతుంది. కళ్యాణపురం అనే కుగ్రామంలో గాంధీజీ అభిమానులు సమావేశం ఏర్పాటు చేస్తారు. జనం తండోపతండాలుగా దానికి వెళుతుంటారు. అందులో ఓ హరిజనుడు గొడుగు వేసుకుని వెళ్ళడం బ్రాహ్మణ పెద్దలకు నచ్చదు. పిలిచి, దుర్భాషలాడి చెప్పుతో కొడతారు. హరిజనుల్లో చలనం కలుగుతుంది. గాంధీజీ బోధనలతో ప్రభావితులై, బ్రాహ్మణాధిక్యతను సహించలేక – ఆలయ ప్రవేశాన్ని కోరుతున్న హరిజనుల్లో అసహనం పెల్లుబుకుతుంది. "పావనమౌ నీ గుడిలో పాదము పెట్టగనిమ్ము హరా / మహదేవ్, జై మహదేవ్, జై మహదేవ్" – అని ప్రార్థిస్తారు. తలుపులు తోసుకుని ఆలయంలోకి వెళ్ళడానికి ప్రయత్నిస్తారు.

సనాతనవాది ఆలయ ధర్మకర్త మేడిచర్ల సుందర రామశాస్త్రికి విషయం తెలుస్తుంది. "మాలలు దేవాలయం అపవిత్రం చేస్తుంటే ఊరుకోవడమేనా ఛీ–బ్రాహ్మణులమై పుట్టి ఏం ప్రయోజనం?" – అని తన వాళ్ళను దూషిస్తాడు. "మీలో బ్రాహ్మణ రక్తం లేదా?" అని ప్రశ్నిస్తాడు. సత్య దృష్టితో, దౌర్జన్యరహితంగా బ్రాహ్మణుల కళ్ళు తెరిపించాలని గాంధేయవాది చౌదరి హరిజనులకు సర్ది చెపుతుంటాడు. సమాధాన పరుస్తుంటాడు. కానీ, మరొక వైపు బ్రాహ్మణులు తమను తాము పొగడుకుంటూ ఉంటారు. "పికిలి పిట్ట, పేడ పురుగు ఒకటే అవుతుందా? సింహం, చీమ ఒకటే అవుతాయా?" – అని ప్రశ్నిస్తుంటారు. తమను తాము ఉన్నతంగా ఊహించుకుంటూ ఉంటారు. అంతే కాదు, పంచములు ఆదివాసులయ్యారనీ, వారే నేడు హరిజనులయ్యారని రేపు ఇంకా ఏం కాబోతారోనని రామశాస్త్రి హేళన చేస్తాడు. కిన్నెరలు, కింపురుషులు, బ్రహ్మరుషులు అవుతారేమోనని గేలి చేస్తాడు. అవసరమైతే బ్రాహ్మణులూ క్షాత్రం పూనగలరని హెచ్చరిస్తాడు. యుగయుగాలుగా తమదై ఉన్న ఈ తాత్విక సంపదను పరులకు ఎంత మాత్రమూ అంటగట్టబోమని స్పష్టం చేస్తాడు. అంతే కాదు, చెరువు నీళ్ళు హరిజనుల గూడేనికి పోకుండా కట్టుదిట్టం చేస్తాడు.



జీవుల గురించి, జీవుల ప్రత్యేకతల గూర్చి మొత్తానికి మొత్తంగా జీవ పరిణామం గురించి ప్రాథమిక అవగాహన లేనివారే సింహం, చీమ ఒకటి అవుతాయా? అని ప్రశ్నిస్తారు. కిన్నెరలు, కింపురుషులు వంటి వారు నిజంగా ఉండరని అవన్నీ మనువాదుల కల్పనలని తెలుసుకోని వారు అజ్ఞానంగానే ప్రశ్నలు కురిపిస్తారు. ఏమైనా తోటి మనుషులకు నీళ్ళు అందకుండా చేయడం ఎంతటి మూర్ఖత్వం? అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతున్న రోజుల్లో అలా జరిగింది గానీ, ఈ ఆధునిక యుగంలోనైతే అది శిక్ష విధించాల్సిన నేరం!

కరడు గట్టిన అగ్రవర్ణాల పెత్తనం కొనసాగుతున్న సమయంలో గూడవల్లి రామబ్రహ్మం ఈ 'మాలపిల్ల' చలన చిత్రం తీయడమన్నది గొప్ప సంచలనం! అది కూడా తెలుగు చలన చిత్ర నిర్మాణ ప్రారంభ దశలోనే తీయడం ఆశ్చర్యం కలిగించే విషయం. మనువాదుల ప్రభావంలో కొట్టుకుపోయిన దర్శక నిర్మాతలు, రచయితలు, కవులు సమాజాన్ని వెనక్కి నడిపించే చలన చిత్రాలు ఇప్పటికీ తీస్తున్నారు. మానవ హక్కుల్ని దెబ్బతీసే హింస, దౌర్జన్యాలు ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారు. వీరంతా–85 ఏళ్ల క్రితమే మాలపిల్లను ఎంతో ధైర్యంగా చిత్రీకరించి ఘన విజయం సాధించిన గూడవల్లి రామబ్రహ్మం నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది! కనీసం తామెంత వెనకబడి ఉన్నామన్నది ఆత్మవిమర్శ చేసుకోవాలి.

సరే–మళ్ళీ నాటి 'మాలపిల్ల' చలన చిత్రానికి సంబంధించిన విషయంలోకి వద్దాం! గాంధీ గారి మనుషులు ఒకవైపు హరిజనులకు నీరు సరఫరా చేస్తూ, మరోవైపు బ్రాహ్మణ వర్గానికి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తుంటారు. గాంధేయవాది అయిన చౌదరి హరిజనులను రెచ్చగొడుతున్నాడని అపార్థం చేసుకుంటారు– బ్రాహ్మణులు! అద్దెకు ఉంటున్న ఆయన్ని ఇల్లు ఖాళీ చేయించి, వీధిన పడేస్తారు. ఆయన ధైర్యం కోల్పోకుండా 'మాలలు మాత్రం మనుషులు కారా?' అనుకుని వెళ్ళి మాలగూడెంలో బస చేస్తాడు. అంతే కాదు, వారిని సంఘటిత పరుస్తాడు. బ్రాహ్మణవర్గం దిగి వచ్చేదాకా సమ్మెకట్టి–సహాయ నిరాకరణోద్యమం కొనసాగించాలని ఉద్బోధిస్తాడు. కార్యకర్తలంతా కలిసి 'కూలీలందరూ ఏకం కావాలిరా' అని సమ్మె పాట పాడుతారు.

ఆలయ ధర్మకర్త సుందర రామశాస్త్రి కొడుకు నాగరాజు ఉన్నత విద్యా భ్యాసం చేసి వస్తాడు. గాంధీయిజం వంటబట్టించుకుంటాడు. అందుకు సంబంధించిన సమావేశాలకు వెళుతుంటాడు. అభ్యుదయ వాదిగా మారతాడు. సాయంత్రాలు ఆ ఊళ్ళో ఉన్న కొండపైకి వెళుతుంటాడు. అలా ఒక రోజు కొండ మీద తిరుగుతుండగా అక్కడ ఒక అమ్మాయిని చూస్తాడు. ప్రేమలో పడతాడు. ఆమె పేరు చంపాలత అనీ, ఆమె ఒక మాలపిల్ల అని తెలుసుకుంటాడు. తన చాదస్తపు తండ్రి లాగా అసహ్యించుకోకుండా హృదయ పూర్వకంగా అంగీకరిస్తాడు. ఆమెతో దేశాంతరం పారిపోయి పెళ్ళి చేసుకుని, మంచి ఉద్యోగంలో స్థిరపడతాడు. పనికిరాని సంప్రదాయాలను దరిచేరనీయకుండా ఆధునికంగా జీవిస్తుంటాడు. తన కొడుకు ఆ విధంగా చేయగలడనీ సుందర రామశాస్త్రి ఏ మాత్రం ఊహించడు. ఆయనా, ఆయన భార్యా కృంగిపోతారు. దేశంలో త్వరితగతిన చోటు చేసుకుంటున్న మార్పులు వారు జీర్ణించుకోలేరు. కానీ, క్రమ క్రమంగా వారిలో కూడా మార్పు వస్తుంది. చిత్రాంతంలో హరిజనులు కూడా మనుషులేనని సుందర రామశాస్త్రి గుర్తించి వారి ఆలయ ప్రవేశానికి ముహూర్తం నిశ్చయిస్తాడు. ఆ వార్త ఆనాటి తెలుగు ప్రముఖ దినపత్రిక 'ఆంధ్రపత్రిక'లో చదివిన కొడుకు, కోడలు–ఆ ముహూర్తానికి కలకత్తా నుండి తిరిగివస్తారు.

ఛాందస భావాలు గల సుందర రామశాస్త్రిగా డాక్టర్ గోవింద రాజుల సుబ్బారావు, కొడుకు నాగరాజుగా గాలి వెంకటేశ్వరరావు, మాలపిల్ల చంపాలతగా ఆనాటి అందాల తార కాంచనమాల నటించారు. బసవరాజు అప్పారావు గేయాల హక్కులన్నీ కొనేసి, గూడవల్లి రామబ్రహ్మం ఈ చిత్రంలో వాడుకున్నారు. "కొల్లాయి గట్టితే నేమి మా గాంధీ మాలడై తిరిగితేనేమి?", "నల్లవాడే గొల్ల పిల్లవాడే" వంటివే కాక, ఇంకా మిగతా పాటలన్నీ తాతాజీ –అంటే తాపీ ధర్మారావు రాసినవి. అంతే కాదు, చిత్రానికి సంభాషణలు సమకూర్చింది కూడా ఆయనే! తాపీవారి పేరు వినగానే చాలా మందికి 'దేవాలయం మీద బూతుబొమ్మలెందుకు?' 'ఇనుప కచ్చడాలు' 'పెళ్లి–దాని పుట్టు పూర్వోత్తరాలు' వంటి ఆయన పుస్తకాలు గుర్తుకు వస్తాయి. ఆ పుస్తకాల పేర్లు తెలియని ఈ కాలపు యువతీ యువకులు ఎవరైనా ఉంటే, సంపాదించి చదవడం మేలు. ఇకపోతే ఈ మాలపిల్ల చిత్రానికి కథను సమకూర్చింది మరో గొప్ప రచయిత గుడిపాటి వెంకటాచలం. శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాసినవాడు. మైదానం, దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, మ్యూజింగ్స్ వంటి ఎన్నో రచనలు చేసిన ఆయన, ఎన్నో వ్యంగ్య నాటికలు కూడా రాశాడు. 'హరిశ్చంద్ర' నాటికలో ఒక సీను ఉంటుంది – అందులో... భార్యను వేలం వేసి అమ్ముతున్న హరిశ్చంద్రునికి పిచ్చి పట్టిందని, ప్రజలంతా గుమిగూడి అతణ్ణి కట్టేసి తంతారు! ఈ ఒక్క దృశ్యంతో చలం ఆలోచనా ధోరణి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

చల్లపల్లి మహారాజా, గూడవల్లి రామబ్రహ్మం, యార్లగడ్డ శివరామ ప్రసాద్ నిర్మాతలు కాగా...భీమవరపు నరసింహారావు సంగీతం సమకూర్చారు. ఆనాటి పాత పాటలు చూడాలన్న అభిరుచి ఉన్నవారు యూట్యూబ్‌లో చూడొచ్చు. నాటి సామాజిక పరిస్థితులు, వాతావరణం కనిపిస్తాయి. సంకల్పం–బలంగా ఉంటే, ఎవరైనా ఎంతటి పనైనా చెయ్యొచ్చు. అందుకు గూడవల్లి రామబ్రహ్మమే గొప్ప ఉదాహరణ! ఆయన ఆనాటి ప్రసిద్ధ పత్రికా రచయిత మాత్రమే. జమీందారో లేక ఫిల్మ్ ప్రొడక్షన్‌లో పెద్ద అనుభవమున్న వాడో కాదు. అయినా, నాటి సమాజాన్ని తన శక్తిమేరకు సంస్కరించాలని 'మాలపిల్ల', 'రైతుబిడ్డ' వంటి ప్రయోజనకరమైన చలన చిత్రాల్ని రూపొందించాడు. ఆ ప్రయత్నం తక్కువదా?

- డా॥ దేవరాజు మహారాజు,
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత,
జీవశాస్త్రవేత్త.

మేడే స్ఫూర్తితో హక్కుల సాధనకై ఐక్యమవుదాం..

క్వారీ కార్మికులకు కనీస భద్రత కల్పించాలి : సిఐటియు

జిల్లాలో 300లకు పైగా నగిరి నుండి కుప్పం వరకు క్వారీలు, గ్రానైట్స్ రోజురోజుకు విస్తరిస్తూ ప్రజాప్రకృతి సంపదను కొల్లగొడుతూ మరోపక్క అందులో పనిచేస్తున్న కార్మికులను శ్రమదోపిడి చేస్తూ యాజమాన్యాలు రోజురోజుకీ అధిక లాభాలు సంపాదించుకుంటున్నారు. వీటిల్లో దాదాపు 15 వేల మంది కార్మికులు ప్రత్యక్షంగానూ పరోక్షంగా మరో 10 వేల మంది పని చేస్తున్నారు. నగిరి ప్రాంతంలో క్వారీలు గ్రానైట్ల వల్ల చుట్టుపక్కల గ్రామప్రజలు పేళు ళ్ల లకు భయభ్రాంతులకు గురవుతూ ప్రాణాలకు గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. అనారోగ్యాలు గురవుతున్నారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి.



చిత్తూరు జిల్లాలోని క్వారీలను పరిశీలిస్తున్న సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు గంగరాజు, సురేంద్ర (ఫైల్)

యాదమరి మండలంలో అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారు. ఆ క్వారీలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదు. అదేవిధంగా పుంగనూరు, కుప్పం ప్రాంతంలో అత్యధికంగా క్వారీలు ఉన్నాయి. ఇక్కడ కూడా అదే పరిస్థితి. క్వారీలలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎవరికీ తెలియకుండా తూతూ మంత్రంగా డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కార్మికుల నుంచి పనిచేస్తూ భారీగా శ్రమ దోపిడీ చేస్తున్నారు. దీనిపై జిల్లాలో ఉన్న మైనింగ్ అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. లేబర్ అధికారుల పరిస్థితి మరీ దారుణం. కార్మిక చట్టాలు ప్రకారం క్వారీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని జీవోలు ఉన్నప్పటికీ ఏ క్వారీలోను అమలు చేయని పరిస్థితి ఉంది. క్వారీలో పని చేయాలంటే చాలా ప్రమాదకరమైన పని. అంత ప్రమాదకరమైన పని చేస్తూ కార్మికులకు మాత్రం కనీస భద్రత ఉండడం లేదు. ఎక్కడా కనీస నియమాలు పాటించడం లేదు.

సిఐటియు ఆధ్వర్యంలో క్వారీలు ప్రత్యక్షంగా పర్యటన చేసినప్పుడు అనేక అవకతవకలు బయటపడుతున్నాయి. అందుకే జిల్లాలో క్వారీ అండ్ గ్రానైట్‌లో పనిచేస్తున్న కార్మికులందరూ ఐక్యంగా మే డే స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు పిలుపునిస్తున్నది. ఈ రోజు ప్రపంచం మొత్తం జరుపుకుంటున్న కార్మిక దినోత్సవంను కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి సాధించి పెట్టారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో వున్న కొంతమంది రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో వుండే కార్మిక వర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగును అందించారు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే, మా శక్తికి కూడా పరిమితులుంటాయి. ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడటం, చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మికవర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి (రెస్టు), ఇంకా ఎనిమిది గంటలు రిక్రీయేషన్ అన్నవి ఈ పోరాటం ద్వారా సాధించుకున్నారు. ఇది పారిశ్రామిక యుగం ఏర్పడిన తర్వాత కలిగిన మార్పు.

చరిత్ర మార్పు

యాంత్రికయుగం రాక ముందు మనిషి గంటలకొద్దీ పనిచేసేవాడు. అదొక బానిస బతుకు. మనిషి తన విజ్ఞాన పరిశోధనల మూలంగా యంత్రాలను సృష్టించుకున్నాడు. యాంత్రిక యుగంలో క్యాపిటలిజం ఏవిధంగా పెరిగిందో అదే స్థాయిలో సామాజిక స్పృహ, చైతన్యం కూడా పెరిగాయి. అందువల్లనే పనిగంటల పోరాటం వచ్చింది. కానీ భారతదేశంలో చికాగో కంటే ముందే, కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజాపోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1923లో మొదటిసారి భారతదేశంలో 'మే డే'ను పాటించడం జరిగింది.

1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటి నుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుండి 'మే డే'ను పాటించడం జరుగుతుంది. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. ముఖ్యంగా, ఐటి రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ఈనాడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉంది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10, 12 గంటలు పనిచేయిస్తున్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో విద్యావంతులైన యువత ఈనాడు శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంత వరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐటి రంగంలో కూడా అమలుకై పోరాటం ఈనాడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి.



అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలులో లేవు.

ఉదాహరణకు : ఇంటర్మీడియట్ వ్యవస్థలో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. అందుకు నిదర్శనమే పై ఉదాహరణ. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10, 12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమ దోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమై పోయాయి. ఆ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడం లేదు. 1886లో ఆరంభమైన ఈ ఉద్యమం వందేళ్ళ పండగ జరుపుకుంది. ప్రపంచంలో ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం.

ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

వ్యాసకర్త: వాడ గంగరాజు
సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

శ్రమజీవి జగతికి మూలం.. చమటోర్చక కదలదు కాలం..

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ప్రపంచ కార్మిక వర్గం 8 గంటల పని విధానం కోసం పోరాడి విజయం సాధించిన రోజే మేడే. ప్రపంచ దేశాల్లోని కార్మికులు మేడేని అత్యంత ఘనంగా జరుపుకుంటారు. 1886లో అమెరికా నగరం చికాగోలో కార్మిక తిరుగుబాటు కార్మికవర్గ చరిత్రను తిరగరాసింది. ప్రపంచమంతటా మేడే స్ఫూర్తితో కార్మిక పోరాటాలు పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా అల్లుకున్నాయి. కార్మికవర్గ వీరోచిత పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాలరాసేలా లేబర్ కోడ్ పేరుతో ప్రభుత్వాలు కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయి. 2025 మే డే స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగాలతో కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను నిలబెట్టుకోవాల్సిన తరుణం ఆసన్నమైందంటూ మేడే వారోత్సవాలకు సిఐటియు పిలుపునిస్తోంది.

లేబర్ కోడ్స్‌పై కార్మికవర్గ యుద్ధం

లేబర్ కోడ్స్ రద్దుపై మే 20న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక వర్గం సిద్ధమవుతోంది. లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు రద్దు అవుపోతాయి. కార్మిక చట్టాల్లో అతి కీలకమైన సమ్మెకు లేబర్ కోడ్స్ రద్దు చేయనుంది. బిల్డింగ్ మైండస్ ఫ్యాక్టరీలు బీడీ పోర్టులు జర్నలిస్టులు తదితర 13 చట్టాలు రద్దు అవుతాయి. బిల్డింగ్ సలహా బోర్డులాంటివన్నీ ఉత్తిత్తి బోర్డులుగా మారుతాయి. పాలకులు కార్మికుల హక్కులను అణిచివేస్తున్నారు. అమల్లోకి రాకుండానే పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ జీతం ఏదీ చెల్లించకపోయినా యజమానులకు శిక్షలు ఉండవు.



తమ హక్కుల సాధనకు సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్వాడీలు (ఫైల్ ఫొటో)

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడిదారులకు పాలకులకు భజన చేస్తున్న ప్రభుత్వాలు కాంట్రాక్ట్ కార్మికులు 50మంది లోపుగా ఉంటే వీరికి ఏ కాంట్రాక్టు కార్మికుల హక్కులు వర్తించవు. కట్టుబానిసలుగా మార్చి హెయిర్ అండ్ ఫైర్‌కు గురవుతారు. పర్మినెంట్ కార్మిక వర్గంపై ఇంత తీవ్రదాడి ఎన్నడూ లేదు. అందుకే ప్రాణాలకు తెగించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలంటూ మే 20వ తేదీ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం సమ్మెకు పిలుపునిచ్చింది. కార్మిక వర్గ హక్కులను కాపాడుకునేందుకు **మేడే స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమిద్దాం.. పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకుందాం...**

గృహ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టండి..

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

గృహ నిర్మాణాలకు సంబంధించి జిల్లాలో యాక్టివ్ బెనిఫిషియారీలను గుర్తించి వారిచే గృహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓలు, హౌసింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో గృహ నిర్మాణ పురోగతిపై ఎంపిడిఓలు, హౌసింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహనిర్మాణాల పట్ల సరియైన యాక్టివ్ బెనిఫిషియారీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి గుర్తించాలని, లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణాల మంజూరుపై అవగాహన కల్పించి త్వరిత గతిన గృహనిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమన్వయం చేసుకుని గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించుకోవాలని ఆదేశించారు. గృహనిర్మాణాల కొరకు నరేగా నుండి నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాకు మొత్తం 77,366 గృహాలు మంజూరు కాగా ఇందులో 50,245 గృహాలు పూర్తి కాగా 8,625 గృహాలు పునాది స్థాయిలో, 4,535 గృహాలు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన గృహాలకు సంబంధించి ఎఫ్‌టిఓలు జనరేట్ చేయాలని సూచించారు. ఎఫ్‌టిఓ జనరేట్ చేసిన బిల్లుల చెల్లింపు త్వరితగతిన జరుగుతున్నవని తెలిపారు. 10,760 లబ్ధిదారులకు రూ.15.90 కోట్లు బిల్లులు చెల్లింపు జరిగిందన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

త్యాగశీలతకు మారుపేరు సుందరయ్య

మే 1న జయంతి సందర్భంగా



పుచ్చలపల్లి సుందరయ్య బాగా కలవారింట పుట్టారు. గొప్ప నాయకునికి ఉండవలసిన త్యాగశీలత, నిరాడంబరత్వం, తాను నమ్మిన విషయాలను నిష్టగా భల్లూకపట్టుతో అనుసరించడం ఆయనకు చిన్ననాడే అలవడ్డాయి. ఏది చేసినా నిష్టగా, తపస్త్రీవ్రతంగా చేయడం ఆయనకు అలవాటైపోయింది. ఈ గుణం పద్నాలుగో ఏటనే రాజకీయాల్లో ప్రవేశించి, 'సోదర సమితి'ని స్థాపించినప్పుడు పొటమరించి, అన్నవరం ఆశ్రమంలో చిగురించి, సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో విరిసి, బోర్‌స్టల్ స్కూలు శిక్ష అనుభవంతో మరింత విస్తరించి ఆయనను ఒక మహానాయకునిగా తీర్చిదిద్దింది.

సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడులో 1913 మే 1న ఓ ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. బాల్యంలోనే వివేకానంద, రామతీర్థుల బోధనలను ఆకళింపు చేసుకున్నారు. గాంధీజీ దేశసేవా దీక్షతో ఉత్తేజితులయ్యారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కొమర్రాజు లక్ష్మణరావు వంటి ఆంధ్ర మహాపురుషుల సాహితీ వికాసంతోనూ, సాంఘిక చైతన్యంతోనూ ఆంధ్రాభిమానాన్ని పెంపొందించుకున్నారు. తన 14వ ఏటనే మద్రాసులో అఖిల భారత కాంగ్రెస్ మహాసభను సందర్శించారు. సైమన్ కమిషన్‌ను బహిష్కరిస్తూ జరిగిన హర్తాళ్‌లోనూ, ప్రదర్శనలోనూ పాల్గొన్నారు. 1930లో మద్రాసు లయోలా కళాశాలలో ఇంటర్ చదువుతూ తోటి విద్యార్థులతో కలిసి 'సోదర సమితి' స్థాపించారు. దేశాభిమానాన్ని పెంపొందించడం, రాజకీయాలను అవగాహన చేసుకోవడం, ఆదివారాల్లో ఖద్దరు అమ్మడం, కసరత్తు చేయడం, సాంఘిక దురాచారాలను రూపుమాపడం, సెలవుల్లో తమ గ్రామాల్లో రైతు కూలీలను విజ్ఞానవంతులుగా చేయడానికి కృషి, సేవ చేయడం 'సోదర సమితి' లక్ష్యాలు. సుందరయ్య ఓ వేమన జయంతినాడు గ్రామంలో సవర్ణ హిందువులకూ, హరిజనులకూ కలిపి భోజనం ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని ధనికరైతులూ, సనాతనులూ ఇది జరగడానికి వీల్లేదనీ దౌర్జన్యానికి తలపడ్డారు. గాంధీ పంథాలో ఆనాడు విశ్వాసమున్న సుందరయ్య వారి హృదయాల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు రెండురోజులపాటు నిరశన దీక్ష చేశారు.

1930 ఏప్రిల్లో గాంధీజీ పిలుపునందుకొని పూర్తిగా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనాలనే సంకల్పంతో కళాశాల చదువుకు స్వస్తి చెప్పదలిచారు. తల్లికీ, అన్నకూ కాలేజీ వదిలిపెడుతున్నానని ఉత్తరం రాసి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఉన్న సత్యాగ్రహ శిబిరంలో చేరారు. అక్కడాయన.. తన నిరంతర కృషికి నిరాడంబరమైన, నిర్మాణాత్మకమైన జీవితానికి అందరి అభిమానాన్ని చూరగొన్నారు. తరువాత ఆయనక్కడుండగానే ప్రభుత్వం అరెస్టు చేసి రెండేళ్ల శిక్ష విధించింది. బాలుడవడంతో ఆయనను తంజావూరులోని బోర్‌స్టల్ స్కూలుకు పంపించారు. అక్కడ రాజకీయ ఖైదీలనుభవిస్తున్న దుర్భర పరిస్థితులకు అసమ్మతిగా జరిగిన ఆందోళనకు నాయకత్వం వహించి రెండుసార్లు నిరసన వ్రతాలను నిర్వహించారు.

1933లో హరిజనోద్యమ సందర్భంగా గాంధీజీ ఆంధ్రదేశ సంచారం చేసినప్పుడు కాంగ్రెస్ వలంటీర్ సంస్థకు ఉప అధికారిగా పనిచేశారు. శాసనోల్లంఘనోద్యమం విఫలం కావడంతో ఆయన అనేకమంది యువకులతోపాటు దేశ స్వాతంత్ర్య సాధనకు ఇతర మార్గాల గురించి ఆలోచించసాగారు. బలప్రయోగంతో మాత్రమే బ్రిటీషు వారిని పారదోలగలమనే ఆలోచనలోకి వచ్చి టెర్రరిస్టులతో సంబంధాలను పెట్టుకోవడం ప్రారంభించారు. బెంగుళూరులో ఉన్నప్పుడు మార్క్సిస్టు సాహిత్యాన్నీ రష్యా విప్లవానికి సంబంధించిన పుస్తకాలనూ అధ్యయనం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయనకు దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పడానికి ఉత్తరాది నుంచి పంపబడిన అమీర్ హైదర్‌ఖాన్‌తో సంబంధం ఏర్పడింది. దానితో సుందరయ్య తన తోటి సహచరులకూ, కాంగ్రెస్‌లోని విప్లవ భావాలుగల యువకులకూ టెర్రరిస్టు ఉద్యమంతో ఉపయోగం లేదని వివరించి వారినందరినీ కమ్యూనిస్టు పార్టీవైపు తిప్పడం ప్రారంభించారు.

1934లో ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. పార్టీని నిర్మిస్తూనే ఆయన కాంగ్రెస్ కార్యకలాపాల్లో కూడా చురుగ్గా పాల్గొంటూ ఉండేవారు. అదేఏడు ఆయన పిసిసి సభ్యుడుగానూ, ఎఐసిసి సభ్యుడుగానూ ఎన్నుకోబడ్డారు. ఆ తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చాలాకాలంపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఒక్క ఆంధ్రలోనేగాక తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూడా కమ్యూనిస్టు పార్టీని స్థాపించే బాధ్యత సుందరయ్యకు అప్పగించారు. కేరళలో ఆనాడు కాంగ్రెస్‌లో అతివాదులుగా పనిచేస్తున్న కృష్ణపిళ్లై, నంబూద్రిపాద్ మొదలగువారితోనూ, తమిళనాడులో పి.రామమూర్తి ప్రభృతులతోనూ సంబంధాలు పెట్టుకొని వారిని కమ్యూనిస్టు పార్టీ వైపుకు ఆకర్షించేటట్టు చేయగలిగారు. వారి సహాయంతో ఆ రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. సుందరయ్య తల్లిదండ్రుల ఆస్తిలో తన వాటాకు వచ్చిన యావదాస్తినీ తెగనమ్మి, ప్రజా ఉద్యమ నిర్మాణానికి ఖర్చు పెట్టి ఆంధ్రదేశంలో మహోన్నతమైన త్యాగ సంప్రదాయాన్ని నెలకొల్పారు. స్వంత ఆస్తి అంటూ ఏమీ లేకుండా చేసుకొని విప్లవ ప్రజా ఉద్యమానికి సంపూర్ణంగా తన జీవితాన్ని అంకితం చేశారు.

తెలంగాణా ప్రాంతంలో పనిచేస్తున్న ఆంధ్ర మహాసభ నాయకులతో అంతకుముందేగల సంబంధాలను మరింత దృఢపరుచుకొని అక్కడ నైజాం పరిపాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించినవారిలో సుందరయ్య ఒకరు. యావదాంధ్రదేశం ఒకే ప్రభుత్వం కింద ఉండాల్సిన ఆవశ్యకతను ప్రబోధించుతూ మొట్టమొదటి సారిగా కమ్యూనిస్టు పార్టీ తరపున 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే పుస్తకాన్ని తెలుగులోనూ, ఆంగ్లంలోనూ ప్రచురించి విశాలాంధ్ర నినాదాన్ని నినాదాన్ని ఆంధ్ర ప్రజల్లోనేగాక యావద్భారతంలోనూ ప్రచారం కావడానికి తోడ్పడ్డారు. ఆ గ్రంథమే ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేసిందంటే అతిశయోక్తికాదని 'ఆంధ్రపత్రిక' తెలుగు వెలుగు శీర్షికన సుందరయ్య గురించి ప్రస్తావించింది.

తెలంగాణా ప్రాంతంలో ఆంధ్ర మహాసభ నాయకత్వాన నైజాం నవాబుకు, నిరంకుశ, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగానూ తిరుగుబాటు ప్రారంభమైంది. అదే సందర్భంలో కోస్తా ఆంధ్రప్రాంతంలో కూడా పీడిత ప్రజలు తమ హక్కులకై ప్రత్యక్ష పోరాటాలకు నానాటికీ తయారవుతున్నారు. ఈ పరిస్థితుల్లో మద్రాసులో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు జారీ చేసి కమ్యూనిస్టులను పట్టుకొని డిటెయిన్ చేయడం ప్రారంభించింది. దానితో సుందరయ్య అజ్ఞాతవాసంలోకి వెళ్లాల్సి వచ్చింది. ఈ కాలంలో ఆయన చారిత్రాత్మక వీర తెలంగాణా సాయుధ విప్లవ పోరాటానికి నేతృత్వం వహించారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి జరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ పెద్ద పార్టీగా ఎన్నికైంది. అయితే మద్రాసు రాష్ట్ర పరిధిలోని తమిళ ప్రాంతంలోనూ, మరట్వాడా, కర్నాటక ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు హెచ్చుగా స్థానాలు రావడంతో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. రహస్యంగా ఉండగానే సుందరయ్య రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1952లో ఉభయ సభల్లో కాంగ్రెస్ తరువాత కమ్యూనిస్టు పార్టీకే హెచ్చు సీట్లు రావడంతో దానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించింది. కమ్యూనిస్టు పార్టీ పక్షాన సుందరయ్య పార్లమెంటరీ పార్టీ నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పార్లమెంట్‌లో వచ్చే ప్రతి సమస్యపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి అన్ని చర్చల్లోనూ ఆయన పాల్గొంటూ ఉండేవారు. పార్లమెంటరీ వ్యవహారాలనేగాక, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడుగా ఆయన కేంద్రంలో ఇతర బాధ్యతలు కూడా చూసేవారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడుగా సుందరయ్య తన నిరంతర కృషి ద్వారా నిర్మాణాత్మకమైన సూచనల ద్వారా నిశితమైన విమర్శల ద్వారా అందరి అభిమానాన్నీ గౌరవాన్నీ చూరగొన్నారు.

1955లో ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రివర్గం పడిపోయి మధ్యంతర ఎన్నికలు జరిగినప్పుడు సుందరయ్య గన్నవరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎన్నికయ్యారు. దానితో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చి తిరిగి ఆంధ్ర రాజకీయాల్లో ప్రధానంగా పనిచేయనారంభించారు. ఆంధ్ర రాష్ట్ర శాసనసభలోనూ, తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలోనూ సుందరయ్య ప్రతిపక్ష నాయకుడుగా ఉండి ఆ స్థానానికి ఒక విశిష్టతను చేకూర్చారు. అంతకుముందు ఎప్పుడూ పాలక వర్గ పార్టీ ముఖ్యునికే ఇవ్వబడే పబ్లిక్ అకౌంట్ కమిటీ (పిఏసి) అధ్యక్ష పదవిని మొట్టమొదటసారిగా ప్రతిపక్ష నాయకుడికి ఇచ్చి ఆంధ్ర శాసనసభ సుందరయ్యను గౌరవించింది.

విప్లవోద్యమం, పార్టీ నిర్మాణ కార్యక్రమం, పార్టీ–ప్రజాసంఘాల కార్యకలాపాలు, పార్లమెంటరీ రంగం ఏదైనా కానీయండి దేనిలోనైనా సంపూర్ణంగా లీనమై కృషి చేయడం.. ఇతరులకంటే మిన్నగా ఆదర్శప్రాయంగా కృషి చేయడం సుందరయ్యలోని ప్రత్యేకత. ఆయన పరిశ్రమశీలత వల్ల ఏ విషయమైనా వివిధ దృక్పథాలతో క్షుణ్ణంగా చదివి, ఆకళింపు చేసుకొని ప్రతివాదులతో పోరుకు ఆయన తలపడతారు. ఒకసారి పార్లమెంట్‌లో క్రిమినల్ లా సవరణ బిల్లు చర్చకు వచ్చింది. న్యాయ శాస్త్రానికి సంబంధించి క్లిష్టమైన క్లాజులతో నిండి ఉండే ఇలాంటి బిల్లుపై చర్చలో న్యాయవాద సభ్యులు మాత్రమే మామాలుగా పాల్గొనడం కద్దు. అలాంటిది సుందరయ్య ఒక రాత్రంతా కూర్చొని బిల్లును సమగ్రంగా అధ్యయనం చేసి అవగాహన చేసుకొని బిల్లుకు ప్రతిపాదించవలసిన సవరణలను తయారు చేసుకొని మరుసటి రోజు చర్చల్లో న్యాయవాద సభ్యులకంటే బాగా మాట్లాడగలిగారు. ఆయన పరిశ్రమకూ, దీక్షకూ తోటి సభ్యులు ఆశ్చర్యపోయారు. ఓ మారెవరో 'నీకు రాజకీయాలంటే తెలుసునేమోగానీ ఆంధ్ర సాహిత్యం సంగతి ఏమి తెలుసు?' అని అధిక్షేపించారట. ఆనాటికుండే ఆయన నన్నయ మొదలు నేటి ఆధునిక కవులుదాకా రాసిన ప్రధాన గ్రంథాలను పుక్కిటబట్టి అర్థంకాని వాటిని పండితుల వద్ద తెలుసుకొని 'ఇక భయంలేదు' అని గుండెమీద చేయివేసుకున్నారట. అందుకు తార్కాణంగా ఆయనవద్ద ఆంధ్ర సాహిత్యానికి సంబంధించిన పెద్ద గ్రంథాలయమే ఉండేది.

భారత కమ్యూనిస్టు పార్టీలో పొడసూపిన రివిజని స్టులతో తెగ తెంపులు చేసుకొని 1964లో కలకత్తాలో భారత కమ్యూ నిస్టు పార్టీ (మార్క్సి స్టు)ని పునర్ని ర్మించారు. ఆ మహాసభలోనే సుంద రయ్య పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తిరిగి ఆయన దేశవ్యాపితంగా పార్టీని పునర్నిర్మించడంలో నిమగ్నమయ్యారు. 1967 ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన ఐక్య సంఘటనా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేరళలో ఇంఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా ఉండగా.. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు.

ఆ మంత్రివర్గాలు పనిచేస్తున్న కాలంలోనే పార్టీలో తీవ్రవాద పోకడలు ఉత్పన్నమైనాయి. రష్యా–చైనా మధ్య ఏర్పడిన వివిదాలతో ఈ పోకడలు మరింత ఉధృతం కావడంతో పార్టీలో అతివాద దుందుడుకు పెడధోరణి ప్రమాదమేర్పడింది. ఈ ఆటుపోట్లనుంచీ కూడా పార్టీని నిలబెట్టుకోవాల్సివచ్చింది.

తన జీవిత చరమాంకంలో కేంద్ర బాధ్యతలను వదులుకొని రాష్ట్రంలో పార్టీ బాధ్యతలు స్వీకరించారు. ఆనాటికి రాష్ట్రంలో వందలాది మంది యువకులను నక్సలైట్ల పేర అమానుషంగా కాల్చి చంపించిన జలగం వెంగళరావు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పౌరహక్కుల ఉద్యమాన్ని నిర్మించారు. పౌరహక్కులతోపాటు ప్రజాతంత్ర హక్కుల సంరక్షణకు దేశ ప్రజల దృష్టి మళ్లించడానికి శాయశక్తులా కృషి చేశారు. భార్గవ కమిషన్ ముందు వెంగళరావు ప్రభుత్వం జరిపించిన అమానుష హత్యలు రుజువు చేయించడానికి ఆయన తీవ్రంగా కృషి చేశారు. ప్రజా సమస్యలపై 1980 ప్రాంతాల్లో అన్ని పార్టీలనూ కూడగట్టి అఖిలపక్ష ఉద్యమాలకు అంకురార్పణ చేశారు. చారిత్రాత్మక సిపిఎం 11వ మహాసభను విజయవాడలో జయప్రదంగా నిర్వహించడానికీ, కృష్ణానదీ గర్భంలో బ్రహ్మాండమైన సభ జరపడానికీ నిర్విరామంగా కృషి చేశారు. విప్లవ ప్రజా నాయకుడు, విరామమెరుగని నిష్కలంక ప్రజాసేవకుడు, ఉత్తమ శ్రేణి దేవభక్తుడయిన సుందరయ్య 1985 మే 19న కన్నుమూశారు.





హైదరాబాద్ సుందరయ్య మ్యూజియంలో భద్రపరిచిన కామ్రేడ్ సుందరయ్య ఉపయోగించిన వస్తువుల్లో కొన్ని..

మేడే

ఈ రోజే ప్రపంచం అంతా
ఎర్ర జండాలతో ఎరుపెక్కిన వేళ
కార్మికులంతా ఒకటేనని
ఎలుగెత్తి చాటిన వేళ
కార్మికులంతా కలిస్తే
ఎరుపెక్కేనే ప్రపంచం
ఈ రోజులా ఎన్నికలప్పుడు కలిస్తే
ఈ రోజులా ఒక్కటై ఎలుగెత్తి చాటితే
కార్మికుడంటే ఏమిటో, కర్శకుడంటే ఏమిటో
తెలిసేది పెత్తందార్లకు,
అలా ఎలుగేత్తేది ఎప్పుడో , మన సత్తా చాటేదేప్పుడో
రాజ్యాన్ని పాలించేదెప్పుడో,
ఈ రోజులా ప్రతి రోజు కలిసుండాలని
కార్మికులంతా
ఐక్యంతో వెలుగెత్తి చాటాలి
ఐకమత్యంతో దేనినైనా ఎదిరించి తీరాలి

జి.యం.పీటర్, గుడివాడ.

శ్రమదోపిడీపై పెనుగర్జన



మొట్టమొదట కార్మికవర్గం ఇంగ్లండులో పుట్టింది. 1764లో నూలువడికే యంత్రం స్పిన్నింగ్ జెన్నీ వచ్చింది. జేమ్స్‌వాట్ ఆవిరియంత్రాన్ని కనుగొన్నాడు.యంత్రాల ఉపయోగించడం, భారీ పరిశ్రమల ద్వారా కార్మికవర్గం పెరిగింది. 1755లో ఇంగ్లండ్ 50 లక్షల పౌండ్ల పత్తిని దిగుమతి చేసుకుంటే 1844 వచ్చేటప్పటికి 60 కోట్ల పౌండ్ల పత్తిని దిగుమతి చేసుకొనే స్థాయికి ఎదిగింది. బ్రిటన్‌లోని నగరాలన్నీ నేతకార్మికులతో నిండిపోయాయి. రంగులద్దడం, చలువ చేయడం, అద్దకం పనులు, వీటితో రసాయనశాస్త్రం అభివృద్ధి చెందింది. ఆవిరి యంత్రానికి అవసరమైన బొగ్గుగనుల త్రవ్వకం కోసం, ఎగుమతి, దిగుమతి అవసరాలకు సముద్ర, రైలు, రోడ్డు మార్గాలు అభివృద్ధి అయ్యాయి. యంత్రాలకు అవసరమైన ఇనుము, రాగి, తగరం, సీసం, గాజు పరిశ్రమలు అభివృద్ధి అయ్యాయి.

8 గంటల పనిదినం కోసం పోరాటం

పెట్టుబడిదారీ విధానపు తొలి దశలో పనిగంటలకు పరిమితులు లేవు. రోజుకు 14 నుంచి 20 గంటల వరకు పని చేయించే వారు. పనిగంటల తగ్గింపు కోసం తొలి నుండి కార్మికవర్గం పోరాడుతూ వచ్చింది.అనేక ఉద్యమాల ఫలితంగా 1837లో అమెరికాలో, 1848లో ఇంగ్లండ్‌లో రోజుకు 10 గంటల పనిదినం చట్టాలొచ్చాయి. ఆ తరువాత 1864లో మొదటి కార్మిక ఇంటర్‌నేషనల్ ఏర్పడింది. అందులో పని గంటల సమస్యపై పోరాడాలని తీర్మానించారు.

అప్పట్లో అమెరికా పరిస్థితి - చికాగో ప్రత్యేకత

1492 అక్టోబరు 12 "క్రిస్టోఫర్ కొలంబస్" వెస్ట్ ఇండీస్ దీవులలో కాలుపెట్టింది మొదలు ఐరోపా ఖండంలోని వివిధ దేశాల నుండి వలసల వెల్లువ ప్రారంభమైంది. అక్కడ సాగించిన నరహంతక హింసోన్మాదం, రక్తపాతం "రెడ్ ఇండియన్" మూలవాసుల జాతి యావత్తునూ తుడిచిపెట్టేసే కార్యక్రమం. అది దాదాపు 250 సంవత్సరాలు సాగింది. కోట్లమంది యూరోపియన్లు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. దురాశాపరులైన లాభాపేక్షాపరులతో పాటు, బ్రతుకుదెరువు కోసం ఇక్కడకు చేరినవారూ ఉన్నారు. ఆఫ్రికా ఖండం నుండి సేచ్ఛా మానవులను బంధించి "బానిసలుగా" లక్షల సంఖ్యలో అమెరికా ఖండానికి తరలించారు.ఇంగ్లండ్‌కు వలసలుగా వున్న 13 అమెరికన్ రాష్ట్రాలు 1776లో స్వాతంత్ర్యం ప్రకటించు కున్నాయి. తొలుత వ్యావసాయిక దేశంగా వున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి. అనేక దేశాల కార్మికులు ఇక్కడ పనిచేసేవారు.

ప్రారంభంలో బ్రిటన్‌లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం 1870–1900లకు మధ్య అమెరికాలో అభివృద్ధి చెందింది. అమెరికాలో 1870లో 16 లక్షల టన్నుల ముడి ఇనుము ఉత్పత్తి బ్రిటన్‌ను మించిపోయి 180 లక్షల టన్నులకు చేరింది. బ్రిటన్‌లో అది 52% పెరిగితే అమెరికాలో 966% పెరిగింది. ఇతర రంగాల్లోనూ అదే పరిస్థితి.

అమెరికా ఉత్తరభాగాన ఉన్న "చికాగో" నగరం పెద్ద పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందింది.1830–48 మధ్యకాలంలో జర్మనీ, ఐరిష్ కార్మికులు పెద్దసంఖ్యలో వలసవచ్చారు. వారికి పోటీగా జెక్, పొలెండ్ కార్మికులను పోటీ కార్మికులుగా రప్పించారు.

పోరాటాల్లో ముందుండే చికాగో కార్మికులు

కార్మిక పోరాటాల్లో చికాగో కార్మికులు ముందుండే సంప్రదాయం వుంది. 1877 లో అక్కడ రవాణా సమ్మె జరిగింది.ఈ సందర్భంగా 8 వేల మందితో జరుగుతున్న సమావేశంపై పోలీసులు దాడిచేశారు. ముగ్గురు కార్మికులు చనిపోయారు. ఇలా అనేక పోరాటాల్లో పాల్గొంటూ రాటుదేలిన కార్మికవర్గం చికాగోలో ఉంది.

మేడే ఎలా వచ్చింది?

1884లో "అమెరి కన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్" చికాగోలో సమావేశమై 1886 మే 1 నుంచి 8 గంటల పని అమలు జరిపించుకోవాలని, అందుకోసం అన్నీ కార్మికసంఘాలు వెంటనే ప్రయత్నాలు ప్రారంభించాలని పిలుపునిచ్చింది. రెండు సంవత్సరాల కాలం పాటు యాజమాన్యాలకు, ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేయడం, కార్మికవర్గంలో విస్తృత ప్రచారం జరగాలని అమెరికన్ కార్మిక సంస్థ నిర్ణయించింది. ఈ పిలుపును అమెరికన్ కార్మికవర్గం ఉత్సాహంతో స్వీకరించింది. 1886 మే 1న అమెరికా అంతటా 12 వేల పరిశ్రమల్లో 3,40,000 మంది కార్మికులు సమ్మెచేశారు. ఒక్క చికాగో నగరంలోనే 80 వేల మంది సమ్మెలో పాల్గన్నారు. ఆ మే 1వ తేదీన చికాగో నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. అమెరికాలోని పెట్టుబడిదారీవర్గమంతా ఈ ఉద్య మాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసింది. పత్రికల్లో సామాజిక యుద్ధం, పెట్టుబడి పట్ల అసహ్యం అనే పేర్లతో సమ్మెకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు.

కార్మికులకు సంఘం విజ్ఞప్తి

కార్మిక సంఘం శ్రామికుల్ని కూడగట్టుకోవడానికి ప్రయత్నిం చింది. "పీడిత కార్మికులారా మేల్కనండి. మే 1, 1886 నాడు పనిముట్లను కింద పడవేయండి. ఆ రోజు విశ్రాంతి కోసం కాదు. తిరుగుబాటు కోసం. ఆ రోజు 8 గంటల పని కోసం, 8 గంటల విశ్రాంతి కోసం, 8 గంటల మన ఇష్టమైన పనుల కోసం జీవి తాన్ని అనుభవించడం మొదలయ్యేరోజు" అంటూ విజ్ఞప్తి చేసింది.

మే డే నుండి చికాగో ఘటనలు

ఆ మే 1న 20 వేల మందితో భారీ ప్రదర్శన జరిగింది.2వ తేదీన కూడా అనేక చోట్ల ప్రదర్శనలు, సభలు జరిగాయి. ఇక, ఆ మే 3న ఒకపక్క "మెక్ కోర్మిక్ రీపడ్ వర్క్స్" కార్మికుల సమావేశం జరుగుతోంది. అప్పటికే 1886 ఫిబ్రవరి 16 నుండి ఆ కంపెనీ కార్మికులు సమ్మెలో ఉన్నారు. కంపెనీలోని కార్మికులు, 6 వేల మంది మున్సిపల్ కార్మికులు ఆ పరిశ్రమకు దగ్గరలో సభ జరుపుతున్నారు. ఆ సభపై యాజమాన్యం ప్రోత్సాహంతో పోలీ సులు కాల్పులు జరపగా ఆరుగురు కార్మికుల మరణించారు. చాలా మంది గాయపడ్డారు. ఇది కార్మికుల్లో ఆగ్రహావేశాలను కలిగించింది. దాంతో, నిరసనగా 4వ తేదీన "హే మార్కెట్ చౌక్" వద్ద సభ జరపాలని నిర్ణయించారు.

ముందుగా ఏర్పాట్లేవి సక్రమంగా చేయలేదు. 20 వేల మంది వస్తారనుకుంటే 3వేల మంది మాత్రమే వచ్చారు. అంతకు ముందురోజు కాల్పులు జరిగివుండటంతో నగర మేయర్ కూడా ఆ ప్రాంతానికివచ్చి సభ వద్ద వున్నాడు. ఉపన్యాసకుల ఆలస్యంతో సభ రాత్రి 8 గంటలకు ప్రారం భమైంది. రాత్రి 10 గంటల వరకు ఉపన్యాసాలు సాగాయి. వర్ష సూచనలతో త్వరగా ముగించి అందరూ వెళ్ళడానికి సిద్ధమ య్యారు. ఇంతలో పోలీసులు సభపైకి దూసుకువచ్చారు. పోలీ సుల మధ్య ఒక బాంబు పేలింది. ఒక పోలీసు చని పోయాడు. పోలీసులు కాల్పులు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో కార్మికులు చనిపోయారు. వందల మందికి గాయాలయ్యాయి.

అక్రమ కేసు – నిర్బంధకాండ

హే మార్కెట్ ఘటన సాకుతో అమెరికా అంతటా కార్మిక వర్గంపై నిర్బంధం ప్రారంభమైంది. చికాగోలో సైన్యాన్ని దించారు. కార్మికవాడలన్నింటిపైనా దాడిచేశారు. వందల మందిని అరెస్టుచేశారు. 50 మందిపై కేసు పెట్టారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేసి 8 మందిని విచారించారు. 1886 ఆగస్టు 19న తుది తీర్పు వెలువడింది. ఏడుగురికి మరణశిక్ష, ఒకరికి యావజ్జీవ శిక్ష విధించారు. అయితే వీరెవరూ బాంబు వేసినట్లు ఋజువు చేయలేకపోయారు. కేవలం వారు కార్మిక వర్గానికి మద్దతుగా వున్నందుకు మాత్రమే శిక్షించబడ్డారు.

కోర్టులో స్పీస్ ప్రసంగం – జన నీరాజనం

శిక్ష పడిన కార్మికుల్లో ఒకరైన స్పీస్ కోర్టులో ధాటిగా తన మాట వినిపించారు. "మమ్మల్ని ఉరి తీసి కార్మికోద్యమాన్ని, తీరని కోరికలతో, దీనంగా అట్టడుగున వున్న లక్షలాది కార్మికులు తమ విముక్తిని సాధించుకోవడానికి సాగించే పోరాటాన్ని ఆపగలం అనుకుంటే అలాగే ఉరితీయండి. ఇక్కడే మీరు నిప్పురవ్వను రగలిస్తున్నారు. అక్కడా, ఇక్కడా మీ ముందు, మీ వెనుక ఎక్కడ పడితే అక్కడ జ్వాలలు లేస్తాయి. అది భూమి అడుగున రేగే జ్వాల. దాన్ని మీరు ఆపలేరు".

1887 సెప్టెంబర్ 14న సుప్రీంకోర్టు అప్పీలును తిరస్కరించింది. క్షమాభిక్ష కోసం గవర్నర్‌కు ప్రపంచమంతటి నుండి అప్పీళ్ళు వచ్చాయి. గవర్నర్ అంగీకరించలేదు. ఒకరిని బాంబు పేల్చడం ద్వారా జైలులోనే చంపేశారు. తమను రక్షించాల్సిందంటూ ఇద్దరు గవర్నర్‌కు విన్నవించగా మరణశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు. మిగిలిన నలుగురినీ 1887 నవంబర్ 11న ఉరితీశారు. నవంబర్ 8 న చికాగో నుండి నిందితులను ఉరితీసే ప్రాంతం వరకు కార్మికవర్గం ప్రత్యేకమైన రైలు నడిపింది. ఉరి తీసిన తరువాత ఊరేగింపు జరిగిన దారిలో 5 లక్షల మంది వరకు నిలబడి నివాళులర్పించారు.

న్యూయార్క్‌లో కుట్ర – పార్సన్ ప్రకటన

ఇంతకూ హే మార్కెట్ సంఘటనలో బాంబు వేసిందెవరు? అది తేలకుండానే మమ్మల్ని ఎలా శిక్షిస్తారని పార్సన్స్ కోర్టులో గర్జించారు. అయినా పెట్టుబడిదారీ తాబేదార్లయిన న్యాయమూర్తులు ఉరిశిక్ష విధించారు. ఎనిమిది గంటల పని ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడటమే వారి లక్ష్యం. అది నెరవేర్చడం కోసమే బూటకపు విచారణ చేశారు.

బాంబు విసిరే మనిషిని న్యూయార్క్ నుంచే పంపించారు. పోలీసు వ్యవస్థను, న్యాయవ్యవస్థను వారు కంట్రోలు చేయగలిగారు. ఇందులో "మెక్ కార్మిక్" పరిశ్రమ యాజమాన్యానిది ముఖ్యమైన పాత్ర. దేశమంతటా 8 గంటల పని ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి పెట్టుబడిదారీ పత్రికలన్నీ కార్మికవర్గంపై విషం చిమ్మారు. 8 గంటలకు పని కుదిస్తే అమెరికా ఆర్థికవ్యవస్థ మొత్తం నష్టాల పాలవుతుందని ప్రచారం చేశారు. వ్యాపార, వాణిజ్యవర్గాలు భారీగా నష్టపోతాయని స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై కూడా ప్రభావం చూపుతుందని వారి ప్రచార సారాంశం.



1886 ఏప్రిల్ 26న "న్యూయార్క్ టైమ్స్" పత్రిక ఇలా వ్రాసింది. "ప్రస్తుతం ప్రముఖంగా వున్న సమస్య సమ్మె. అది అనేక విధాల అవాంఛనీయం. దీన్ని పరిష్కరించడానికి సులభమైన అడ్డదారి ఒకటి వుంది. సమ్మెలో పాల్గన్న ప్రతివాడి మీద కుట్రకేసు మోపి ఖైదు చేయడం. మరో పద్ధతి నాయకులను ఎంచి శిక్షపడేటట్లు చేయడం".

న్యూయార్క్ ట్రిబ్యూన్ ఇలా వ్రాసింది – "కార్మికులను చట్టవ్యతిరేక పద్ధతుల్లో పాల్గనేటట్లు చేయడం, రెచ్చగొట్టడం ఉత్తమమైన పద్ధతి".

వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించడం కోసం రూపొందించుకున్న పథకం ప్రకారం హే మార్కెట్ ఇన్‌స్పెక్టర్ బోనఫ్‌ఫీల్డ్ సహకారంతో వ్యూహాన్ని అమలుచేశారు. అమెరికన్ కార్మికవర్గానికి గుండెకాయ లాంటి చికాగో నగరంలోని కార్మిక నాయకులందరిపైన నేరం చేయడం, చేయకపోవడం అనే దానితో నిమిత్తం లేకుండా శిక్షకు గురిచేశారు. వారు అనుకున్న లక్ష్యాన్ని కొంతమేర సాధించారు.

అమెరికా నుండి అంతర్జాతీయతకు

మే 1వ తేదీన ప్రారంభమైన కార్మికోద్యమాన్ని అణచాలని పెట్టుబడిదారీవర్గం అనుకుంటే అది ప్రపంచ మంతా అల్లుకుంది. ఆ రణన్నినాదం దేశ దేశాలను చుట్టుముట్టింది. 1889లో ప్యారిస్‌లో జరిగిన రెండో అంతర్జా తీయ కార్మికసంఘం ప్రథమ మహా సభ ప్రతి మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం జరపాలని తీర్మా నించింది. ఎనిమిది గంటల పని దినం, ప్రజాస్వామ్యం, కార్మిక హక్కుల కోసం ఉద్యమించా లని నిర్ణయించింది. 1917కు కార్మికవర్గం సోవియట్‌లో రాజ్యాధికారానికి వచ్చిన తరువాత ప్రపంచమంతా 8 గంటల పనిదినాన్ని చట్ట బద్ధంగా అంగీకరించాల్సి వచ్చింది. ఇది కార్మికులు సాధించిన విజయం. చరిత్ర మర్చిపోని ఈ అధ్యాయాన్ని స్మరించి, ఆ స్పూర్తితో ముందుకు సాగడమే శ్రమ జీవుల కర్తవ్యం.

దేశభక్తి

మాట్లాడకు
మౌనాన్నే ఆశ్రయించు.
కాదని గొంతు విప్పావో
ఊరికూరికే గాయపడిపోతాయి మనోభావాలు....
అరే పిచ్చోడా!
ఇప్పుడు నిజాలు ఎవడిక్కావాలి?
పచ్చి అబద్ధాలే
పరమప్రీతి కదా అందరికీ!
ప్రశ్నించకు మౌనాన్ని సాధన చేయి
కాదని నిలదీశావో
నువ్వో దేశద్రోహివి జాతికి శతవ్వి
అరే వెర్రోడా!
ఇప్పుడు పురోగమనం ఎవడిక్కావాలి?
తిరోగమనమే ఉన్నతాదర్శం కదా అందరికీ!
ఆలోచించకు
చైతన్యాన్ని సమాధి చేసేయ్
కాదని బుర్రకు పని కల్పించావో
నువ్వో తీవ్రవాదివి, శతదేశపు గూఢచారివి
అరే అమాయకుడా !
ఇప్పుడు భవిష్యత్తెవడికి కావాలి
మతప్రాయమైన గతమే
సంస్కృతి కదా అందరికీ !
నోరెత్తకు ప్రశ్నలు సంధించకు
ఆలోచనామతాలను వెదజల్లకు
అప్పుడు మాత్రమే
నువ్వో అపర దేశభక్తుడివి!

\- రత్నాజేయ్

ఒక క్రాంతి గీత

ఒక్కసారి ఆపి చూడండి,
ఈ మే డే బ్యానర్లు ఎంత మెరుస్తున్నాయో!
కానీ... ఆ బ్యానర్ల క్రింద
కూలీల చేతుల్లోని మచ్చలు
ఇంకా నిప్పుల్లా మండుతున్నాయి.
"8 గంటల పని, 8 గంటల విశ్రాంతి"
అనే నినాదాలు గాలిలో కరిగిపోయాయి,
ఇప్పుడు ఓవర్ టైమ్ అనే దెయ్యం
కార్మికుల ఊపిరితిత్తుల్లోకి
సిమెంట్ పోస్తోంది.
అంతర్జాతీయత ఎంత దూరం?
ఫ్యాక్టరీ గేట్లోనే అడ్డుకట్టుగా నిలిచిపోయింది,
ఒక్కో డాలర్ లాభానికి
ఒక్కో కార్మికుని జీవితం
స్ప్రెడ్‌షీట్లో నంబరుగా మారుతోంది.
యూనియన్ అంటేనే
పోలీసుస్టేషన్‌లో అరెస్ట్
ధర్నా చేస్తే ఎఫ్ఐఆర్
సమ్మె చేస్తే సస్పెన్షన్
పెన్షన్ కోసం అర్జీ దాఖలు చేస్తే
ఆర్థిక సంవత్సరం అంతా వేచి ఉండమని చెప్తారు.
కానీ... ఈ మే డే ఒక హెచ్చరిక:
"మేము మర్చిపోలేదు" అని
ఆ కర్మాగారం గోడలకు
రాత్రిళ్లు రక్తంతో రాస్తున్నాం.
మార్పు రావాలని ఉంది,
అది ఓటు పెట్టినా రావచ్చు,
లేదా రోడ్డుపై కూర్చున్నా రావచ్చు,
కానీ రాక తప్పదు ..
ఎందుకంటే...
మే డే అంటే ఒక రోజు కాదు,
అది ఒక శపథం ..
తరతరాల నుంచి.. తరతరాల వరకు!

- శాంతిశ్రీ

చెమట ఒక కావ్యం

చెమట...
అపరిచిత పదం కాదు
తొమ్మిది ఇంటు ముప్పై..
రెండు వందల డెబ్బై రోజులపాటు
శిశువును మోసి కన్న క్షణాల
నుదుటిపై కట్టిన
చెమట బిందువుల పుట్టను
నింగి ఒక నిప్పుల గొడుగు
నేల ఒక నిప్పుల తల్పం
సలసల మరిగే నల్లని తారు
రహదారుల నిర్మాణంలో
ప్రవహించే చెమట కాలువను
మబ్బుల కనులు విప్పి
సూర్య బాలుడు నిద్ర లేవక
మునుపే
పొలాల్లో రెక్కలు ముక్కలు
చేసికొన్న చెమట బొమ్మను
ఇటుక సిమెంటు మట్టి తట్టలు మోస్తూ
అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో
ఒళ్ళంతా ధూళి మేఘం ధరించిన చెమట నదిని
థూ... ఈ ప్రపంచమెప్పుడూ
పురుషాహంకార భావజాలాల
కుళ్ళి కంపుకొట్టే మురిక్కాలవే
శ్రమదినాంతాన
అరచేతిలో ఎప్పుడూ విరిగిన రెక్కల పిట్ట
అసమానతల ఆడకూలీ డబ్బులపిట్ట
ఎగిరే ఎర్రజెండాల సుందర ప్రపంచంలో
మేడే నాడైనా
మా శ్రమకు తగిన ఫలితం దక్కుతుందా..

- మందరపు హైమవతి,
9441062732